# రాసేశ్వరి శ్రీరాధ





శ్రీ రాధికా ప్రసాద్ మహరాజ్

నాన్నగారు

శ్రీరాధే

# రాసేశ్వరి శ్రీరాధ

రచయిత

**శ్రీ రాధికా ప్రసాద్ మహరాజ్**

(నాన్నగారు)

ప్రకాశకులు

శ్రీ రాధా మహాలక్ష్మి ఆశ్రమము

శ్రీ బృందావనధామము - మధుర జిల్లా (ఉత్తరప్రదేశ్)

సర్వస్వామ్య సంకలితము
ప్రథమ ముద్రణ
మార్చి, 2003

అమూల్యము

ప్రతులకు
**శ్రీ రాధాకృష్ణ మందిరము**
5/5 అరండల్ పేట
గుంటూరు - 522 002.
ఫోన్ : 2233933

ముద్రణ :
**విజయసాయి ఆఫ్‌సెట్ ప్రాసెస్ అండ్ ప్రింటింగ్**
డొంకరోడ్, గుంటూరు - 2,
ఫోన్ : 2242345

# ముందుమాట

**'రాసేశ్వరి శ్రీరాధ'** అను ఈగ్రంధమును కొన్ని ప్రపంచభాషలలో ప్రకటీకృతము గావించి, ఖండఖండాతరములలో పంచిపెట్టి, మన జనని శ్రీరాధాదేవి మహాప్రతిష్ఠను దశదిశల వ్యాపింపచేయ నిశ్చయించినాను. ఈ గ్రంథ వ్యాప్తితో పాటు మా ఆశయము ఒక్కటే. ఆకాశవాణి ప్రకటించిన శ్రీ రాధాసుధానిధి యందలి 80వ శ్లోకము ప్రకారము అనేక మంది జీవుల చేత నిరవధిక రాధాధ్యానమును చేయింపనెంచితిమి. తత్ఫలితముగా అట్టిజీవుల కర్మభారము తనంతట తానే తొలగిపోవును. ఏనాడు జీవుల కర్మక్షయమగునో ఆనాడు వారు దివ్యశక్తి సంపన్నులై పై ధామములకు వెళ్ళగలుగుదురు. ఇది శ్రీ రాధాదేవి లోకమునకు ఇచ్చిన అమృత సందేశము.

**రాధికా ప్రసాద్**

గ్రంథకర్త

## విషయసూచిక


**ఒకటవ అధ్యాయము :**

**జీవుల సనాతన స్వరూపము - వారికి గల శక్తులు**

1) భరద్వాజమహర్షి

2) కణ్వమహర్షి

3) పరశురాముడు

4) ప్రహ్లాదుడు

**రెండవ అధ్యాయము :**

**భగవదంశలయిన జీవులు పతనమగుట ఎట్లు జరిగినది ?**

1) జయవిజయులు

2) జడభరతుడు

3) బ్రహ్మదేవుడు

4) సౌభరి మహర్షి

**మూడవ అధ్యాయము :**

**సర్వేశ్వరి రాధాదేవి**

I) రాధాదేవి యొక్క హ్లాదినీశక్తి మహిమ

1) మదనమోహన మోహినీ లీల

2) నరవాహనుడు

3) విఠల్‌దాస్‌జీ మహరాజ్

4) శ్రీజీ జైపూర్ లీల

**నాల్గవ అధ్యాయము :**

**శ్రీ రాధాపరమేశ్వరీ అనుగ్రహమును పొందుట ఎట్లు ?**

ఏది నిజమైన సాధన ?

శ్రీ రాధా అనుగ్రహమును పొంది తరించిన జీవులు :

1) రసిక భక్త రెహమాన్ బాలుని అపూర్వ రాధా భక్తి

2) శ్యామానందుడు

3) గులాబ్ బాబా

4) మహారాజా కులచంద్రుడు

**ఐదవ అధ్యాయము : పాఠకమహాశయులకు ఒక అమృత సందేశము**

# రాసేశ్వరి శ్రీరాధ

## అధ్యాయము - 1

## జీవుల సనాతన స్వరూపము

పరమోన్నతమైన చైతన్యమే పరమాత్మ. అతడు పూర్ణ స్వరూపుడు. ఆ పరమాత్మ యొక్క అంశయే జీవాత్మ. శ్రీకృష్ణుడు గీతయందు

**"మమైవాంశో జీవలోకే జీవ భూతస్సనాతన:**
**మన: షష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి"** 15-7

అని చెప్పియున్నాడు. జీవాత్మసాక్షాత్తు భగవదంశ స్వరూపుడు. సముద్రము, దాని కెరటము ఎట్లో పరమాత్మయు, తదంశయు అట్లే. ఇద్దరును సనాతన స్వరూపులే, నిత్యులే.

భగవదంశ సంభూతుడైన జీవుడు మహోన్నత స్థితిలో నుండి, మానవాతీతమైన దివ్యశక్తులను ఎన్నియెా కలిగియుండెడివాడు. అగ్నిహోత్రము యొక్క అంశకు అగ్నిలక్షణములు కొన్నియైనను ఉండక తప్పదు. అట్లే భగవదంశయగు జీవునకు కూడ భగవత్ శక్తులు కొన్నియున్నవి. ఈ రహస్యమును గూర్చి శాస్త్రములలో భగవదంశగా నుండు ఆత్మయొక్క శక్తులు వర్ణింపబడినవి. ఇందులకు ఉదాహరణగ భగవదంశ సంభూతులయిన కొందరు దివ్యపురుషుల జీవితములను గూర్చి క్రింద వ్రాయుచున్నాము.

# భరద్వాజ మహర్షి

రామాయణములో వర్ణింపబడిన భరద్వాజమహర్షి ఒక శుద్ధ జీవాత్మ స్వరూపుడు. శ్రీరామ చంద్రుని కలసి కొనుటకై ఆయన సోదరుడగు భరతుడు కొన్నివేల మంది అయోధ్యాపురజనులతోను, అనేక గుర్రములతోను, ఏనుగులతోను బయలుదేరి దారిలో భరద్వాజ మహర్షి ఆశ్రమములో సాయంకాలము ఆగిపోదలచి మహర్షికి కబురు పెట్టెను. మహర్షి ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "నాయనా భరతా! నీవును, నీపరివారమంతయు నేటి రాత్రి ఇచటనే విశ్రాంతి తీసికొనుడు. అందరును ఇచ్చటనే భుజించి, నన్ను సంతోష పెట్టవలయును. ఇది నా ఆజ్ఞ". ఒక ఋషి, ఒకరిద్దరు శిష్యులు మాత్రమే ఆవనములో ఉండిరి. "ఇన్ని వేలమందికి ఆహారము ఆయన ఎట్లు సమకూర్చగలడు"అని భరతుడు మనస్సులో శంకించుచుండెను. భరద్వాజుని యొక్క శుద్ధ జీవాత్మ శక్తి వలన ఆరాత్రి అన్ని వేల మందికి భోజనము సమకూరెను. ఏనుగులకు చక్కని కొలను కూడ తయారయినది. గుర్రములకు పచ్చిక బయలు తయారయినది. మహర్షి యొక్క శుద్ధజీవాత్మ శక్తికి భరతుడు ఆశ్చర్యచకితుడయ్యెను. శుద్ధ జీవాత్మశక్తికి ఇదియొక ఉదాహరణ.

# కణ్వ మహర్షి

ఈ శక్తిలోని మరియొక కళను గమనింపుడు.

వ్యాస భగవానుని మహాభారతములో ఒక మహర్షి లీల ఎంతటి దివ్యశక్తి సంపన్నమో, ఎంత సుందరమయినదో చూడుడు. కణ్వమహర్షి ఆశ్రమము భగవత్ శక్తియగు ప్రేమ కళతో నిండియుండెను. అచట పెద్దపులులు, లేడి పిల్లలు, ఆవుదూడలు - అన్నియు కలసి పరస్పర విరోధమును మరచి మైత్రీ భావముతో సహజీవనము కొనసాగించినవి. విరుద్ధ సంస్కారములు కలిగిన ఈ జీవులు సుందరమయిన ప్రేమపాశముచే కట్టుబడి

స్నేహభావముతో ఒకే చోట ఆహారమును తినుచుండెడివి. భగవత్ప్రేమతో నిండిన జీవుల చెంత పరస్పర విరోధములుండవు. అంతయు నిష్కామ ప్రేమ తప్ప విరోధభావమనునది భగవంతుని ప్రేమలోకములో కనిపించదు. రాజర్షియైన విశ్వామిత్రుడు ఈ అద్భుతమైన ప్రేమలీలలను చూచి తమ బిడ్డయగు శకుంతలను అచటనే విడిచిపెట్ట వలసినదని మేనకకు ఆజ్ఞ ఇచ్చి వెడలిపోయెను. పరిశుద్ధమయిన భగవదంశయే కణ్వమహర్షి. భగవదంశ స్వరూపులకు ఇట్టి శక్తులు సహజముగనే యుండునని ఆయన జీవితము ప్రకటించుచున్నది. ఒకప్పుడు మనకు కూడ అట్టి దివ్యశక్తులు ఉండెడివి.

## పరశురాముడు

శుద్ధజీవాత్మ శక్తికి మరియొక గొప్ప ఉదాహరణ పరశురాముడు.

శుద్ధజీవాత్మ అయిన పరశురాముడు తాను ఒక్కడే అయ్యును తనశక్తిచే ఇరువది యొక్క పర్యాయములు రాజవంశీయులపై దండెత్తి, అగ్ని జ్వాలలు రగిలించి, అసహాయశూరుడై రాజవంశములను మట్టుపెట్టెను. ఇట్టి శక్తి పరిశుద్ధ భగవదంశ స్వరూపులకే యుండును. ఇది మూడవ ఉదాహరణ. ఈలోక జీవులలో నేడు ఎంత వెదకినను అట్టి దివ్యశక్తి కన్పించదు. జీవులలో నేడు అట్టి దివ్యశక్తి ఏల కన్పించుటలేదో తర్వాతి అధ్యాయములో వివరింపబడును.

## ప్రహ్లాదుడు

భగవదంశ సంభూతులలో మరియొక మహాత్ముడు శ్రీ ప్రహ్లాదుడు. ఒకప్పుడు అసురకోటిని సంహరించుటకై దేవతలు పోవుచుండగ దారిలో వారికి గర్భవతియైన హిరణ్యకశిపుని భార్య లీలావతి కనిపించెను. "హిరణ్యకశిపుని కంటెను బలమైన రాక్షసుడు ఈమె గర్భము నందుండి యుండవచ్చును. కనుక ఈమెను సంహరించుట శ్రేయస్కరమ"ని దేవతలు

యోచించుచుండిన సమయమున నారదుడు అచ్చటికి వచ్చి, "దేవతలారా! ఈమె గర్భములో నున్న వాడు అసురుడు కాడు. భగవదంశ సంభూతుడు, దివ్యసంపత్తితో కూడుకొనియున్న ఒక మహానుభావుడు" అని చెప్పెను. ఆయన లీలావతి గర్భమునందున్న పిండమును వర్ణించుచు "ఈ పిండము ఒక భగవదంశ సంభూతునకు చెందినది. లీలావతిని సంహరించుటవలన దేవతలకు తీరని నష్టమే అగును. ఈమెను నా ఆశ్రమమునకు తీసికొనిపోయి నేనే ఈమెకు ఆశ్రయము కల్పించెదను" అనెను. పిండదశయందే ఉన్న భగవదంశ సంభూతుడైన ఆ శిశువును గూర్చి తప్ప నారదుడు ఈ ప్రపంచమునందు మరెవ్వరిని గూర్చియు అట్టిదశయందు వర్ణించి యుండలేదు.

నారదుడు లీలావతిని కూర్చుండబెట్టి గర్భస్థపిండమునకు భగవత్తత్త్వ రహస్యములను గూర్చి చెప్పుచుండినప్పుడు ఆమె గర్భము నుండి 'ఊ ఊ' అను శబ్దము వినవచ్చుచుండెను. పిండదశనుండియే ఈ జీవునకు గొప్ప సత్సాంగత్యము, ప్రేమ లభించినవి. ఆ జీవుడే బాలప్రహ్లాదుడు. ఆ పిల్లవాడు అభ్యసించుచుండిన భగవత్తత్త్వము, భగవత్ప్రేమ తండ్రి హిరణ్యకశిపునకు ఇష్టము లేకుండెను. తోటి బాలకులకు భగవంతుని గూర్చి ప్రహ్లాదుడు చెప్పుచుండెడివాడు. ఇదియును గురువులకు, హిరణ్యకశిపునకు ఇష్టము లేకుండెను. తన అన్నయైన హిరణ్యాక్షుని సంహరించిన శ్రీహరియందు హిరణ్యకశిపునకు సహజముగనే విరోధమున్నది. అట్టి హరినే నిరంతరము ధ్యానించుచున్న కుమారుని ప్రవర్తనను ఆ రాక్షసుడు సహింపలేకపోయెను. కుమారుని పట్ల మిక్కిలి ప్రేమ గల హిరణ్యకశిపుడు నయమున, భయమున బాలుని మార్చుటకు ప్రయత్నించెను. ఎన్ని విధముల ప్రయత్నించినను బాలుడు హరినామస్మరణము మానలేదు. దానితో కోపించిన హిరణ్యకశిపుడు కుమారుని అనేక విధములుగా హింసించెను. విషముపెట్టించియు, పాములచే కరిపించియు, మరుగుచున్న

చమురులో పడవేయించియు, ఏనుగులచే త్రొక్కించియు- ఇంకను ఎన్నియో విధములుగ ప్రహ్లాదుని బాధించెను. బాలుని ఇంత తీవ్రముగా హింసింపవలదని హిరణ్యకశిపునకు ఆతని భార్య విన్నవించినది. దీనితో మరింత క్రుద్ధుడైన హిరణ్యకశిపుడు బాలునకు తల్లియే స్వయముగా విషమును ఈయవలసినదని ఆజ్ఞఇచ్చెను. నిస్సహాయురాలైన ఆ తల్లి విషపుపాత్రను బాలునకు ఈయలేక కొంతతడవు ఆలస్యము చేసినది. దుః ఖించుచున్న తల్లిని చూచి, ప్రహ్లాదుడు " అమ్మా ! నీకీదుఃఖమేల? సర్వత్ర వ్యాపించియున్న నా హరి అనుక్షణము నా వెన్నంటియే ఉండెను. ఆయన రక్షణలో ఉన్న నాకు భయములేదు" అనుచు తల్లి చేతినుండి విషపాత్రను తీసికొని 'హరీ ! హరీ!' యనుచు విషమును త్రాగెను. భగవచ్ఛక్తి, భగవత్ప్రేమ వలన బాలునకు ఏమియు కాలేదు. తుదకొకరోజున తండ్రి పిల్లవానిని పిలచి "అను క్షణము నీవు 'హరీ హరీ' అని పలుకుచున్నావు. ఆహరి ఎవడురా? వానిని నాకు చూపింపుమురా" అని అడుగగా పిల్లవాడు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "నేనుస్మరించుచున్న హరి సామాన్యుడు కాడు. ఆయనను నీవు చూడదలచుకొంటివా? ఆ హరి ఇందుకలడు, అందులేడు అని సందేహము వలదు. నాహరి ఎందెందువెదకిచూచిన అందందేకలడు. నీవు ఎచ్చట కోరిన అచ్చటనే హరి ప్రసన్నమగును. ఆయనను సంహారింపకలిగినవాడు పదునాలుగులోకములలో లేడు. ఈ లోకమునందంతటను ఆయనను చూడగలుగు శక్తిని ఆయనయే నాకు ప్రసాదించినాడు" అని చెప్పుచుండగా హిరణ్యకశిపుడు "నీ హరిని ఈ ఉక్కు స్తంభములో చూపించగలవా?" అని అడిగెను. బాలుడు ఉక్కు స్తంభమునకు నమస్కరించి "స్వామీ! నా తండ్రికి దర్శనమీయుమ"ని కోరగా భయంకర శబ్దముతో ఆ స్తంభము పగిలిపోయి అందుండి మహా ఉగ్రనరసింహ రూపమున శ్రీహరి ప్రకటమయ్యెను. ఆ ఉగ్రరూపమును చూచి ఎల్లప్పుడు శ్రీహరి హృదయమందే నివసించు లక్ష్మీదేవియు,

ఆంతరంగిక భక్తుడైన నారదుడును భయముతో దూరముగ వెళ్ళిపోయిరి. కాని హరిప్రియుడగు ప్రహ్లాదుడు ఎవ్విధమైన భయమును పొందక నరసింహ స్వామి దగ్గరకు చేరినాడు.

భగవదంశ సంభూతుడయిన భక్తునకు భగవంతుడు సులభముగా దర్శనమిచ్చును. భగవదంశ సంభూతుడు ప్రహ్లాదుని వలె నిర్భయముగా జీవించును. ఆతనికిభయమనునది తెలియదు. ఆతడు ఆరాధించు భగవంతుడు సర్వవ్యాపకమూర్తి. కనుకనే గీత యందు

**"బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాంప్రపద్యతే**
**వాసుదేవ స్సర్వమితి స మహాత్మా సుదుర్లభః"**

**7-19**

అని కృష్ణుడు చెప్పియున్నాడు. అట్టి పురుషుడే ఎట్టి వేషభాషలు లేని నిజమైన మహాత్ముడు. అటువంటి మహాత్ముడు ఈ ప్రపంచమున కోటికొకరుందురు. ఒకప్పుడు మనము కూడ అట్లు భగవదంశ సంభూతులమై యుంటిమి. అట్టి స్థితి యందుండెడి మహాత్ములమైన మనము ఏ కారణము చేత దిగజారి సామాన్య జీవులుగా మారుట సంభవించినదో ఇప్పుడు గమనించెదము.

# అధ్యాయము - 2

## భగవదంశలయిన జీవులు పతనమగుట ఎట్లు జరిగినది?

భగవదంశగా ఉన్నటువంటి జీవుడు దుర్బలుడై దిగజారి, జంతులక్షణములనే కలిగి పుట్టుట ఎట్లు జరిగినది? శక్తి సంపన్నుడై భగవదంశగా ఉండవలసిన జీవుడు క్షుద్రమయిన, దుర్బలమయిన సామాన్య జీవాంశగా పెక్కు దుఃఖములతో కూడుకుని అన్నవెూరామచంద్రాయని విలపించుచు మృత్యుభీతితో అనుక్షణము భయపడుచు అల్పాయుష్మంతుడైన జీవునిగా మారుట ఎట్లు జరిగినది?

పరిశుద్ధమయిన జీవాత్మలు అందరును భగవదంశలే. కాబట్టి వారందరు కూడ పైనుదహరించిన విధముగ కొన్ని మహోన్నతమైన శక్తులను ఒకప్పుడు పొందియున్నవారే! అట్టివారిలో అనేకులు ప్రకృతి సంపర్కము చేత, విషయసుఖవాంఛలచేత తమశక్తులను పోగొట్టుకొనినారు.

"మనయేవ మనుష్యాణాం
కారణం బంధమోక్షయోః"

అని వేదములో ప్రవచించినట్లు మాయకు వశమైయున్న జీవులమనస్సే ఇందులకుకారణము. మనస్సునకు రెండు రూపములున్నవి. ఊర్ధ్వరూపము, అధోరూపము. ఊర్ధ్వమనస్సు భగవానుని వైపునకు, అధోమనస్సు బంధనముల వైపునకు త్రిప్పును. జీవునిమనస్సు పెక్కు కోరికలతో నిండియుండును. అది కామరహితమైన ప్రశాంత మనస్సుకాదు. ప్రాపంచిక జీవులకు అనేక కోర్కెలుండును. సన్యాస స్థితిలో ఉండు జీవునకు ఒక్కటే కోరిక - అదియే భగవత్ ప్రాప్తి.

జీవులు ఎంతటి శక్తి సంపన్నులైనప్పటికి అహంకారము పెరిగి

మహాత్ములను తృణీకరించుట, అవమానించుట జరిగినచో వారు తమ శక్తులను కోల్పోయి పతనమై అధోలోకమునకు దిగజారుట తథ్యము. అట్లు దిగజారిన వారలలో కొందరు రాక్షసులుగా మారినారు. భగవల్లక్షణములతో కూడుకొని మహాపురుషుల నిపించుకొనుచు చతుర్భుజులై వైకుంఠద్వార పాలకులుగానున్న జయవిజయులు ఆకోవకు చెందినవారు. జాగ్రత్, స్వప్న, సుషుప్త, తురీయ స్థితులను ఏకకాలమందు చూడగలుగు దివ్యశక్తి సంపన్నులు వీరు. ఇట్లు చూడగలుగుటయే చతుర్భుజములుగ సంకేతింపబడినది. తమ అపరాధము చేత చతుర్భుజములను కోల్పోయిన వారి వృత్తాంతము సంగ్రహముగా ఇచ్చట తెలియజేయుచున్నాము.

## జయవిజయులు

ఒకనాడు సనకసనందనాదులు వైకుంఠము నందలి శ్రీ మహావిష్ణువును దర్శించవలెనను అభిలాషతో ఆరుద్వారములను దాటి ఏడవద్వారము వద్దకు చేరుకొనిరి. అచ్చట విష్ణుమూర్తివలె చతుర్భుజులైయున్న జయవిజయులు అను ఇరువురు ద్వారపాలకులు తమ గదలు పట్టుకొని నిలచియుండిరి. సనకాదులు వారిని లక్ష్యపెట్టక, మొదటి ఆరు ద్వారములవలె ఏడవద్వారమును కూడ దాటబోయినారు. నిర్భయముగను, నిస్సంకోచముగను దాటిపోవుచున్న వారిని ద్వారపాలకులైన జయవిజయులు అడ్డగించినారు. సనకసనందులు వయస్కులే అయినను బాలకులవలె సంకోచములేక సంచరించువారు. బాలురవలె దిగంబరులుగా ఉండువారు. సనకాదులు సర్వత్రసమదర్శనులు. వారు ఆనాటివరకు ఆటంకమనునది ఎరుగరు. మహనీయులైన ఆమహాపురుషులు అవమానమును పొందినారు. ద్వారపాలకులు భగవత్‌దర్శనమునకు ఆటంకము కలిగించినందున వారిలోకోపము పెల్లుబికినది. " ఓరీ ! ఎవరురా మీరు? భగవత్పరిచర్యలు చేసి ఈ లోకమును సాధించువారు ధన్యులు.

ఈ లోకముననుండువారెల్లరు సమదర్శనులు. మీరు అట్లు గాక విషమవర్తనులై సంచరించుచున్నారేమి? దేవ వేషము దాల్చినను మీకు సమదర్శనము లేదు. కావున మీరిచట ఉండరాదు. వైకుంఠనాధునకు భృత్యులైన మీ అపరాధమునకు తగిన దండనము విధించవలెను. మీరు ఈ లోకమువీడి కామ, క్రోధ, లోభములకు, పాపరూపులకు నెలవైన క్రిందిలోకములో ఏడుజన్మలెత్తి శాపమును అనుభవించుదురుగాక" అని శపించిరి. అంతకుపూర్వమే లక్ష్మీదేవి తన వైష్ణవీశక్తితో భక్తులను కాపాడి తిరిగి వైకుంఠమునకు వచ్చి తన పతియైన శ్రీ మహావిష్ణువు వద్దకు వెళ్ళబోగా జయవిజయులు ఆమెను కూడ అడ్డగించియుండిరి. "స్వామి ఏ స్థితిలోనున్నను ఆయన వద్దకు పోవుటకు నాకు సర్వాధికారములున్నవి. ఈ క్షుద్రులా నన్ను అడ్డగించుట" అని లక్ష్మీదేవి నొచ్చుకొనెను. లక్ష్మీదేవిని అవమానించిన జయవిజయులు ఆక్షణమునుండియే కళావిహీనులై చతుర్భుజములు పోయి తమ శక్తులను కోల్పోయిరి. ఆపై సనకాదులను అవమానించిరి. అదే సమయమున శ్రీ మహావిష్ణువు అచ్చట ప్రత్యక్షమయ్యెను. ఆయనను చూచిన వెంటనే తమ దుస్థితిని గమనించుకొనిన జయవిజయులు విలపించిరి. తాము పొందిన శాపమును తగ్గింపుడని మహావిష్ణువును వేడుకొనిరి. అప్పుడు శ్రీ మహావిష్ణువు దయాళుడై వారి శాపమును మూడు జన్మలకు తగ్గించెను. ఆ విధముగా శాపగ్రస్తులైన జయవిజయులు పతనమై రాక్షసులుగ మారి భూలోకమునకు దిగిపోయిరి. వారే లోకకంటకులైన హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగను, రావణ కుంభకర్ణులుగను, శిశుపాల దంతవక్త్రులుగను జన్మించిరి

పైన వర్ణించిన జయవిజయుల వృత్తాంతము వలన మహాపురుషులను గాని, అవతార పురుషులను గాని, ఉత్తమ శ్రేణికి చెందిన పరమ పవిత్ర గ్రంథములను గాని తృణీకరించినను, అవమానపరచినను లేక దూషించినను అది గొప్ప వైష్ణవ అపరాధమగునని స్పష్టమగుచున్నది.

ఇట్టి వైష్ణవాపరాధములకు శిక్ష విధింపబడుట దైవనియమము.

**"అంతరమ్ముఖ నమారాధ్యాయైనమః బహిర్ముఖ నుదుర్లభాయైనమః"**. జీవుడు బహిర్ముఖుడై యున్నంతవరకు భగవంతుని దర్శింపలేడు. బ్రహ్మదేవుడు బహిర్ముఖుడై ఎంత ప్రయత్నించినను తాను ఎవరో, తనకు తండ్రి ఎవరో తెలిసికొనలేక పోయెను. ఆయన తనను తాను తెలిసికొనుటకు వేయి దివ్య సంవత్సరములు బహిర్ముఖముగా ప్రయత్నించి విఫలుడై, తుదకు తప! తప! అను దివ్యవాణి ఆదేశానుసారము నూరు సంవత్సరములు అష్టాంగ యోగక్రియానురక్తితో అంతర్ముఖుడై ఆపై యోగ మహిమచే పురుషోత్తముని దర్శింపగలిగెనని శ్రీమద్భాగవతము నందలి తృతీయ స్కంధము ప్రకటించుచున్నది. నివృత్తి మార్గమున జీవితమును కొనసాగించిన వారు సులభముగా భగవంతుని చేరగలరనియు, బహిర్ముఖముగా పోవువారు ప్రకృతి వస్తువులను మోహించి, వాటితో తాదాత్మ్యము పొంది, వాటిని భోగించి సుఖములను పొందినచో ఉన్నత స్థితి నుండి అధోస్థితికి దిగజారుట, మానవ జన్మమును విడచి జంతు జన్మనెత్తుట, ఆయువును కోల్పోయి అల్పాయుష్మంతునిగా చనిపోవుట ఇత్యాది అరిష్టములకు, బాధలకు గురియగుదురని శాస్త్రములు వచించుచున్నవి.

## జడ భరతుడు

ఒకప్పుడు భరతుడు మంచి ఉన్నత స్థితిలో నుండెడివాడు. ఐశ్వర్య సంపన్నుడైన ఆ రాజు వైరాగ్య సంపన్నుడై తన ఐశ్వర్యమును బంధుజనులకెల్ల పంచిపెట్టి ఒక అరణ్య ప్రదేశమునందు ఆశ్రమము నిర్మించుకొని కొందరు ఆశ్రమవాసులతో కలసి జీవించుచుండెను. ఒక దినమున గర్భవతియగు ఒక లేడి సింహము చేత తరుమబడి, నది అంతయు ఈదుకొని భయభ్రాంతులతో భరతుని ఆశ్రమములోనికి ప్రవేశించి పిల్లనుకని అచ్చటనే

ప్రాణములను విడచిపెట్టినది. ఆ లేడిపిల్లను దయాళుడగు భరతుడు శ్రద్ధతో పెంచి పెద్దచేసెను. దానితో అనేక విధములుగ ఆటలాడుచు, ఆ లేడి యొక్క ప్రేమను చూరగొని తండ్రిప్రేమను చూపినాడు. ఇంతలో తనకు మరణము ఆసన్నము కాగా ఆదిక్కులేని అల్పజీవియగు లేడి పిల్లను దగ్గరకు తీసికొని "పిచ్చిదానా! నీ భవిష్యత్తును తలచుకొనిన నాకు దు:ఖము కలుగుచున్నది. నేను చనిపోయిన పిదప ఆశ్రమవాసులెల్లరును ఎవరికి వారు చెల్లాచెదరై పోయెదరు. అప్పుడు నీవు దిక్కులేని దానవయ్యెదవు. ఆహారము లేక నీవు చనిపోయినను చనిపోవచ్చును" అని దు:ఖపడెను. అట్లు ఆ లేడి భవిష్యత్తును తలచుకొనుచు ఆయన కన్నీరు కార్చుచు చనిపోయెను. ఒకజీవుడు ఏ ప్రకృతి వస్తువును తలచుకొనుచు ప్రాణములను విడచునో మరు జన్మమున ఆ వస్తురూపమునే పొందునని శాస్త్ర ప్రమాణము.

లేడిపిల్లను తలచుకొనుచు చనిపోయిన భరతుడు "యద్భావోతద్భవతి" అను జగన్నియమానుసారము మరు జన్మలో లేడిగా పుట్టెను. అయినను వానికి మానవ చైతన్యమున్నది. ఆయన లేడి రూపముననే ఆలయమునకు పోవుచుండెను. పురాణములను వినుచుండెను. భగవన్నామ సంకీర్తనన్ను భక్తితో వినుచు కన్నీరు కార్చుచుండెను. ఆతరువాత జన్మలో ఆ లేడి జడభరతునిగా మారినది. ఆతడు భగవదనురక్తితో జడునిగా ఉండెడివాడు. ఈ విధముగా ఆయనకు రెండు జన్మలు వృధా అయినవి. ఆయన బహిర్ముఖుడు అగుటచే ఈ కథ అంతయు జరిగినది. ఈ విధముగా జీవుడు తన బహిర్ముఖ దృష్టిచేత లెక్కలేనన్నిగా తన జన్మల సంఖ్యలను పొడిగించుకొనుచున్నాడు. ఇట్టి జన్మల వలన కర్మకూడ పెరుగుచున్నది. ఆ కర్మ అనుభవించినగాని జీవుని విడిచిపెట్టదు. ఈ విధముగా మానవజన్మ వృత్తాకారముగా నడచుచున్నది. బహిర్ముఖస్థితి వలన జీవునకు ఇట్టి స్థితి కలుగుచున్నది. ఏనాటికైనను ప్రకృతి యందు సాక్షీభావమును, భగవంతుని యందు తాదాత్మ్యమును పొందినగాని

జీవుడు తరింపడు.

భగవంతుని యొద్దకు పోవు సాధనామార్గము చాలా కష్టము. సాధనామార్గములో అనేకరకములైన అడ్డంకులు కలవు. దేహాత్మభావము, స్త్రీ పురుష భేదము మొదలగునవి కొన్ని ఆటంకములు. వానిని దాటుకొని పోనిచో జీవునకు పతనము తప్పదు. జీవుడు తాను ఆత్మనను విషయము మరచి దేహమే తానని భ్రమపడుచు సదా దేహసుఖము కొరకే పాటుపడుచున్నాడు.

మానవదేహము త్రిగుణాత్మకము. ఆ త్రిగుణములలో ఒకటైన రజోగుణమే "కామయేషక్రోధయేషరజోగుణ సముద్భవ:" అని గీతలో చెప్పిన విధముగా కామక్రోధములుగా విప్పారుచున్నది.

## బ్రహ్మదేవుడు

బ్రహ్మదేవుని ప్రథమ సృష్టి ఒక బాలిక. ఆ బాలిక అత్యంత సుందరముగా నుండెడిది. బ్రహ్మ త్రిగుణాత్మకుడు. త్రిగుణములలో ఒకటైన రజోగుణమునందు కామక్రోధములున్నవి. కనుక బ్రహ్మయందున్న కామమే ఆయనను రెచ్చగొట్టి ఆ బాలికను మోహింపజేసెను. తనను నిరాకరించుట చేత కోపోద్రేకముతో ఆ బాలికను భూలోకమునందు వెదురు తుప్పగా పుట్టుమని బ్రహ్మ శపించినాడు. అదే సమయమున మరీచియొక్క ఆరుగురు కొడుకులు బ్రహ్మ విద్య నేర్చుకొనుటకై అచ్చటికి వచ్చిరి. ఇది యంతయు చూచి వారు పరిహాసము చేసినందున బ్రహ్మ వారిని భూలోకమున దేవకీదేవి గర్భమున పుట్టి కంసునిచే చంపబడుదురు గాక అని శాపము నిచ్చెను. ఇంత మందికి శాపకారణము బ్రహ్మదేవుని రజోగుణమే.

స్త్రీ పురుషులు అప్రయత్నముగా పరస్పరము కామముతో పరుగులు తీయుట సృష్టి రహస్యము. ఈ అన్యోన్యకామలీల దేవతలు, మానవులు, జంతువులు, క్రిమికీటకాదులలోనే కాక పుష్పములు, లోహముల

యందుకూడ ఉన్నది.

## సౌభరి మహర్షి

సౌభరి మహర్షి ఋషులందరిలోను మహాశక్తిమంతుడు. కామమును జయింపగోరి అతడు జలస్తంభన విద్యచేత ఒక నదీ గర్భమునందు కూర్చుండి తపం బాచరించుకొను చుండెను. ఒకనాడు ఆ నదిలోనే శృంగార కలాపములలోనుండిన చేపల జంటను చూచి ఆయన వెంటనే కామమును పొందెను. తపంబు మానుకొని ఒడ్డునకు వచ్చి, మాంధాత చక్రవర్తి ఇంటికి వెడలి ఆయనకు గల అవివాహితులైన ఏబది మంది బాలికలలో ఒక బాలికను తనకిమ్మని కోరెను. "మేము క్షత్రియులము. మాలో స్త్రీలకు తమకు నచ్చిన పురుషుని ఎన్నుకొను అధికారమున్నది. మరి మీ వయస్సు సుమారు 99 సంవత్సరములు" అని చక్రవర్తి పలుకగా సౌభరిమహర్షి "నన్నొకసారి ఆ బాలికలను చూడనిమ్ము. వారిలో ఏ బాలికయైనను నన్ను కోరుకున్నచో ఆమెను నేను తీసికొని వెళ్ళెదను. నా వివాహ విషయములో నీకెందుకయ్యా నిర్ణయము? అది ఆ బాలికలకే వదలివేయుము" అని పలికెను. అప్పుడు చక్రవర్తి తన బాలికలనందరిని చూపించెను. ఆ బాలికలను చూచుటకు పూర్వము సౌభరి మహర్షి మన్మధుని పిలచి "నీ రూపమును నాకిమ్ము" అని ఆజ్ఞాపించెను. అటుపై మన్మధ సౌందర్యముతో సౌభరి ఆ బాలికలను సమీపింపగా ఆ ఏబది మంది బాలికలు ఆయనను మోహించిరి. సౌభరి మహర్షి ఆ బాలికలనందరను వివాహమాడి తీసికొని వెళ్ళెను.

ఈ విధమైన పరస్పర కామము స్త్రీ పురుషులలో నున్నట్లే పుష్పజాతిలో కూడ నున్నది. ఒక తుమ్మెద పురుషజాతి పుష్పము పై వాలి అచటి పుప్పొడి అంటిన పాదములతో స్త్రీ పుష్పము పై వాలును, ఆపై స్త్రీ జాతి పుష్పము ఫలించును. ఇట్టి స్త్రీ పురుష అన్యోన్య ఆకర్షణయే జగత్తు

యొక్క రహస్యము.

భగవత్సేవకు కట్టుబడిన మనస్సు పరమాత్మసేవ కోరుకొనును. నికృష్టమైన మాయకు కట్టుబడిన మనస్సు నీచస్థితి యందే సదా నివసింపగోరును.

భగవదంశలయినటువంటి జీవుల మనస్సు నున్నటి అద్దము పలె స్వచ్ఛముగా నుండును. దానిపై మనకు ఒక్క మచ్చకూడ కనిపించదు. అట్టి మనస్సు భగవచ్ఛక్తిని, భగవత్ప్రేమను, భగవత్ జ్ఞానమును, భగవజ్జీవితమును చక్కగా ప్రతిబింబించును. భగవద్భావముతో నిండియుండవలసిన జీవుని మనస్సునందు విషయసుఖ వాంఛలనెడు ముద్రపడినంతనే జీవితము మారిపోవును. ప్రాపంచిక వస్తు సుఖములను కోరుకొనిన జీవుడు క్షుద్రుడు కాక తప్పదు.

కంటికి కాటరాక్టు వచ్చినప్పుడు ఆ కన్ను జగత్తును చూడలేకున్నది. అట్లే పైన వర్ణించినట్లు జీవులు పతనమై తమ మనస్సులపై కాటరాక్టు వంటి ముద్రలను పొంది భగవంతుని చూడలేక కొందరు నాస్తికులై, కొందరు క్షుద్రులై, కొందరు రాక్షసులై క్షీణ దశను పొందుచున్నారు.

ʘ ʘ ʘ

# అధ్యాయము - 3

# సర్వేశ్వరి రాధాదేవి

క్షుద్ర దశలోనున్న జీవుడు ఊర్ధ్వగతికి పోవుటకు వీలులేదా? వీరిని రక్షించి పైధామమునకు తీసికొనివెళ్ళగలుగు ఏ మహాదేవతయు లేదా? కలదు. అట్టి మహాదేవతయే వేదవేదాంగములలో స్తుతింపబడి, లోక కల్యాణమూర్తియై, మహాశోభాయమానముగా విరాజిల్లుచున్న సర్వేశ్వరి రాధాదేవి.

ఒకప్పుడు వేదవేత్తలు బ్రహ్మదేవుని ఒక ప్రశ్నవేసినారు. "ఇంతమంది దేవతలు ఉండగా రాధాదేవినే ఎందుకు పూజింపవలయును? శ్రీ రాధనే ఎందుకు ఆరాధింపవలెను? దీనికి కారణము తెలియ పరుప ప్రార్థించుచున్నాము" అని వారు బ్రహ్మను ప్రార్థించినారు. అప్పుడు బ్రహ్మ ఇట్లు సమాధానము చెప్పెను. "రాధాదేవి సమస్త దేవతలకును, సకల శక్తులకును మూలము. స్వయం భగవానుడైన శ్రీ కృష్ణుడే సదా ఆ తల్లిని ఆరాధించుచున్నట్లు "కృష్ణేన ఆరాధ్యతేతి రాధా" అను రాధికోపనిషద్వాక్యము స్పష్టము చేయుచున్నది. కనుక ఆ సర్వేశ్వరేశ్వరినే అందరును ఆరాధించుచుందురు. రాధాదేవి యొక్క మహాశక్తులను గూర్చియు, మహత్తులను గూర్చియు వర్ణించుటకు నాకు ఆయువు చాలదు. (బ్రహ్మదేవుని ఆయుర్దాయము 31,10,40,00,00,00,000 మానవ సంవత్సరములు)

**"గుణరహితం కామనా రహితమనుక్షణ వర్ధమానమ్" -**

స్వామినియైన రాధాజీ త్రిగుణాతీత. భావ జగత్తులో ఎట్టి కామనలును ఉండవు. ఆ తల్లి లీలలు అనుక్షణ వర్ధమానములు, నిత్యనూతనములు. అందువలననే ఇంత ఆయువు కల్గిన బ్రహ్మకూడ రాధను వర్ణించుటకు తన ఆయువు చాలదని చెప్పుచున్నాడు.

**"అనాద్యోయం పురుషఏక ఏవాస్తి**
**తదేకం రూపం ద్విధా విధాయ**
**సర్వాన్ రసాన్ సమాహరతి**

**స్వయమేవ నాయికా రూపం విధాయ**
**సమారాధన తత్పరోభూత్**
**తాం రాధాం రసికానందాం వేదవిదోవదంతి"॥సామ వేదరహస్యము.**

పరమ పురుషుడగు భగవానుడు తనయందలి రసముల నన్నింటిని లీలారూపముగ ప్రకటీకృతముగావించుటకై తానే సర్వేశ్వరియగు శ్రీ రాధగా నాయికారూపమును కూడ ధరించెనని సామ వేదరహస్యము చెప్పుచున్నది. ఆ సుందరనాయికా రూపమును గాంచి తన్మయత్వము చెందవలనను కోరికతో స్వయముగా నాయికారూపమును ధరించెను.

బ్రహ్మాండ నాయకుడైన శ్రీ కృష్ణుడు సమస్తరసములకును అధీశ్వరియగు శ్రీరాధాదేవిని తన ఆరాధ్య పరదేవతగా స్వీకరించితిననియు, ఆమె దివ్య గుణములను వర్ణించుటకు రోమరోమములో జిహ్వాయున్నను తనకు సాధ్యము కాదనియు చాటిచెప్పెను.

**"కృష్ణేన ఆరాధ్యతేతిరాధా"**

రాధికోపనిషత్తు

కృష్ణ భగవానుడు స్వయముగా శ్రీ రాధాదేవిని ఆరాధించుట చేతనే ఆమెకు రాధ అని పేరు వచ్చెను.

శ్లో॥ **"దేవీ కృష్ణ నమాప్రోక్తా రాధికావరదేవతా"** - బృహత్ గౌతమీయతంత్రము

శ్రీ కృష్ణుని ఆరాధ్య వరదేవతయే శ్రీరాధ. కనుక బ్రహ్మాండములందలి సమస్త జీవసముదాయమునకును సహజమైన పరమ మహోన్నత ప్రేమ వస్తువేగాక పరమ మహోన్నత ఆరాధ్యదేవికూడ శ్రీరాధయేయని మనకిప్పుడు స్పష్టమగుచున్నది.

శ్రీ కృష్ణదాస కవిరాజగోస్వామి వంగభాషలో వ్రాసిన "చైతన్య చరితామృతము" అను గ్రంథములోని ఆదిలీల యందు ఒక మహావిషయము

వర్ణింపబడినది. అది శ్రీ కృష్ణుడు చేసిన శ్రీరాధాదేవిస్తుతి.

1. ఆమా ఇహతే ఆనందిత్హై త్రిభువన్ ।
ఆమాలే ఆనంద్ దేనే సేధే కౌన్ జాన్ ॥
2. ఆమాహైతే యార్హై శత శతగున్ ।
శైజన్ ఆహ్లాదితే పారే మోర్ మన్ ॥
3. ఆమాహైతే గుణీబడా జగతే అసంభవ్ ।
సకలి రాధితే తాహకరి అనుభవ్ ॥
4. కోటి కామ జిన్ రూప్ యద్యపి ఆమార్ ।
అసమోర్ధ్య మాధుర్య సంయ నహీయార్॥
5. మోరరూపే ఆకర్షిత్హై త్రిభువన్ ।
రాధారదర్శన్ మోర్ జుడాయ నయన్
6. మోర్ వంశీ గీతే ఆకర్షిమే త్రిభువన్।
రాధర వచన్ హమార్ శ్రవన్॥
7. యద్యపి హమార్ గంధేజగత్ సుగంధ్ ।
మోరా చిత్ప్రాణ్ హరే రాధా అంగ్ గంధ్॥
8. యద్యపి అమార్ రసే జగత్ సరస్।
రాధార్ అధర్ రస్ ఆమా కరే వశ్॥
9. యద్యపి అమార్ స్పర్శ్ కోటి ఇంద్ శీతల్।
రాధికార్ స్పర్శ్ ఆమా కరే సు శీతల్॥

భావాను వాదము :

శ్రీ కృష్ణుడు మిక్కిలి హృదయ భారముతో తనలో తాను ఇట్లు తలంచుకొనుచుండెను. "ఈశ్వర: పరమ: కృష్ణ: సచ్చిదానంద విగ్రహ:" అనుచు శాస్త్రములు నా ఆనంద స్వరూపమును వర్ణించుచున్నవి. నా సచ్చిదానంద స్వరూపము త్రిభువనములలోను నిండియున్న కారణమున

సమస్త జీవులును ఆనంద తరంగములనే ఆస్వాదించుట జరుగుచున్నది. కాని నేను తన్మయుడనై ఆనందభావసమాధిలో మునిగిపోవునట్లు తీవ్రమైన ఆనందము నాకు ప్రసాదించువారు త్రిభువనములలో రాధాదేవి తప్ప మరెవ్వరును లేరు. ఈ విశ్వమునందు నా కంటెను అధికగుణసంపత్తిని పొందిన వారు ఎవరున్నారు? ఒక్క రాధ మాత్రమే నాకంటె అధిక సంపత్తితో ప్రకాశించుచున్నది."

"వేలాదిమంది గోపికలను వేణువు ఆకర్షించుచున్నది. కాని ఆవేణుగానము నాకు రుచింపకున్నది. ఒక్కసారి రాధాదేవి నా యొద్దకువచ్చి 'కన్నయ్యా' అని పిలచి నన్ను ప్రేమతోతాకినంతనే నేను లోకములను మరచిపోయి ఆనందముతో తన్మయుడనయ్యేదను".

శ్రీ కృష్ణుడు రాధాదేవిని స్తుతించుటను గూర్చి బ్రహ్మవైవర్త పురాణము నందు క్రింది విధముగా వర్ణింపబడి యున్నది.

శ్లో॥ **కృష్ణంవదంతి మాం లోకా స్త్వయైవ రహితం యథా**

**శ్రీ కృష్ణంచ నదాతేపిత్వయైవ నహితం వరమ్॥**

'నీవు లేని నన్ను కృష్ణుడందురు. నీతో కూడియున్నపుడు నన్ను శ్రీ కృష్ణుడందురు.' ఈ వాక్యానుసారము శ్రీ రాధాదేవియే సర్వశక్తి స్వరూపమని శ్రీకృష్ణుడు స్వయముగ ప్రకటించినట్లు స్పష్టమగుచున్నది.

బృందావనమున యమునా నదీతటమున శ్రీ కృష్ణుడు తన దివ్య ద్విభుజరూపమును శివునకు చూపించి ఇది సుదుర్లభమని పలికి ఇట్లు చెప్పెను.

**"విహారామ్యానయా నిత్యమస్యా: ప్రేమ వశీకృత:**

**ఇమాంతు మత్ప్రియాం విద్ధి రాధికాం వరదేవతామ్"॥** -పద్మ పురాణము

భావము: ఈమె ప్రేమచేవశీకృతుడనై నిత్యమును ఈమెతోడనే విహరింతును. ఈనా ప్రేమమూర్తిని పరదేవతయగు రాధగా నెరుగుము.

నిన్నెట్లు పొందవలెనని శివుడు అడుగగా కృష్ణుడిట్లు చెప్పెను.

**"గోపీ భావముతో మాఇద్దరిని శరణు పొందినచో నేను లభింతును"**

**"యో మామేవ ప్రపన్నశ్చ మత్ప్రియాం న మహేశ్వర।**

**న కదాపి నచాప్నోతి మామేవం తే మయోదితమ్।"**

నన్ను శరణు పొందినను, నా ప్రేమమూర్తియగు శ్రీ రాధను శరణుపొందనిచో నేను లభింపను.

**"నకృదావాం ప్రపన్నో వా మత్ప్రియామేకాకికాం నుత।**

**సేవతే నన్యభావేన న మామేతి న నంశయః।"**

-- పద్మ పురాణము, పాతాళఖండము, 82వ అధ్యాయము.

నన్ను శరణు పొందకున్నను కేవలము శ్రీ రాధను అనన్యభావముతో సేవించిన వానికి నేను లభింతును. ఇందు సంశయము లేదు.

పైన ప్రకటించిన శాస్త్ర ప్రమాణములననుసరించి తనను శరణు పొందకున్నను కేవలము శ్రీ రాధను ఆరాధించినను తాను ప్రసన్నమగుదునని స్పష్టముగ శ్రీకృష్ణుడే ప్రకటించియున్నాడు. దీనిని బట్టి రాధ యందు కృష్ణుడు భావరూపముతో ఉన్నట్లు స్పష్టమగుచున్నది.

భక్తుడు తనకు నిత్యసేవకుడగుటకు తన అంతరంగిక శక్తి స్వరూపమగు శ్రీ రాధయొక్క అనుగ్రహము అత్యవసరము, అనివార్యము అని శ్రీకృష్ణుడే నారదునికి ఇట్లు ప్రకటించెను.

శ్లో॥ **సత్యం సత్యం పున: సత్యం సత్యమేవ పున: పున:**

**రాధా నామ్నా వినాలోకే మత్ప్రసాదో నవిద్యతే"**

నారద పాంచరాత్రము

శ్రీరాధానుగ్రహము లేనిదే కృష్ణుడు లభింపడని పై ప్రమాణము వలన స్పష్టమగుచున్నది.

శ్రీరాధ యొక్క స్వామినీత్వమును, పరాత్పరత్వమును, అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకత్వమును దేవీభాగవతమిట్లు ప్రకటించుచున్నది.

శ్లో॥ **"కృష్ణ ప్రాణాధికాదేవి తదధీనో విభుర్యత:**

**రాసేశ్వరీ తస్యనిత్యం తయాహీనోనతిష్ఠతి"**

**"కృష్ణస్తు భగవాన్ స్వయమ్"** అని వేదవేదాంగములచే స్తుతింపబడు శ్రీకృష్ణభగవానునకు ప్రాణాధిష్ఠానదేవి శ్రీరాధ. ఆమె రాసేశ్వరి. శ్రీకృష్ణుని రాసకునిత్యస్వామిని. శ్రీరాధలేనిదే కృష్ణుడు లేడు. కృష్ణుడు సదా ఆమెకు అధీనుడు'. ఆహా! ఏమి మహావాక్యములివి!

రాధాతత్వము అనంతము, అగాధము, అసామాన్యము, అపూర్వము అని అనేక శ్రుతి, స్మృతి, పురాణ తంత్రగ్రంథములు విశదీకరించుచున్నవి.

1961వ సంవత్సరములో పాట్నాపురమునందు "భారతీయ వాఙ్మయములో శ్రీరాధ" అను విషయముపై ప్రపంచమహాసదస్సుజరిగినది. ఆ సదస్సుకేవలము రాధాదేవి యొక్క వైశిష్ట్యమును ప్రతిబింబించుటకే నిర్వహింపబడినది. ఆసదస్సుకు కాశీ విశ్వవిద్యాలయములో సంస్కృతశాఖాధ్యక్షులైన ప్రొఫెసర్ బలదేవ్ ఉపాధ్యాయ కన్వీనరు. భారతదేశమునకు చెందిన మహాపండితులును, కొంతమంది వేదవేత్తలును కలసి మూడుదినములు వరుసగా వేదోపనిషత్తుల ఆధారముగా జరిపిన

ఆసదస్సు నందు శ్రీరాధను గూర్చిన చర్చను సాగించినారు. వారి ఉపన్యాస ప్రవచనములలో శ్రీరాధామహాదేవి యొక్కస్వరూప, స్వభావ, తత్వాదికములు ప్రకటింపబడినవి. సచ్చిదానంద పూర్ణపురుషుని ముఖ్యశక్తియు స్వామినియు రాధాదేవియేయనియు, ఆమెయే సర్వశక్తులకు మూలశక్తియనియు, సర్వసిద్ధులకు పూర్ణస్వరూపిణి యనియు ఆగోష్ఠిలో నిరూపింపబడినది. సర్వశాస్త్రముల సారము ఇదియేయని ఆ గోష్ఠిలో నిర్ణయింపబడినది. ఇది భారతదేశము యొక్క ఆధ్యాత్మిక వేత్తల వాణిగా భావింపబడినది. ఈ విషయములన్నియు "భారతీయ వాఙ్మయ్‌మే శ్రీరాధా" అను 523 పుటల ఉద్గ్రంధ రూపమున ప్రకటింపబడినవి.

## మదనమోహనమోహినీ లీల

శ్రీరాధ పదునాల్గు లోకములకును స్వామిని. ఆ దేవియే అనాదియైన, సనాతనమైన పరమ పురుష భావము. అదియే గీతలో "**తత్వత:**" (7-3) అని చెప్పబడినది. పరమపురుషభావమే రెండుగనై, స్వయముగ నాయికా రూపమును ధరించినది. అనాయికా రూపమునే వేదవిదులు 'రాధ' అనిస్తుతించిరి. సర్వేశ్వరియైన శ్రీరాధాదేవికి మహాశక్తులనేకము కలవు. వానిలో హ్లాదినీశక్తి సర్వశ్రేష్ఠమైనది అని వేదమే ప్రకటించుచున్నది. ఆ హ్లాదినీ శక్తికి లోబడనివాడులేడు.

బ్రహ్మదేవుని, మహాదేవుని, మహాసిద్ధ పురుషుడైన సౌభరి మహర్షిని విషయకాముకులుగా మార్చి వారిని పతనముగావించిన మన్మధుడు కృష్ణుని కూడ ఒక కాముకునిగా మార్చి వేసి తాను భూలోక చక్రవర్తి యగుటకై ఒకనాడు కృష్ణుని వద్దకు వచ్చినాడు. మన్మధుడు తన సంకల్పమును గూర్చి చెప్పిన వెంటనే 'మన్మధా! ఇంకకొన్ని రోజులలో నేను గోపికలతో మహారాసలీలను జరుపబోవు చున్నాను. ఆరాసయందు యౌవనములో నున్న వందలాది గోపికలను నీవుచూడగలవు. వారిలో ఒక్క గోపికయందైనను

నీవు కామ వికారమును కలిగించినచో నేను నీచేతులలో ఓడిపోయినట్లు భావించెదను' అని కృష్ణుడు పలికెను. అప్పుడు సంతోషముతో మన్మథుడు 'బ్రహ్మదేవుని వంటి, మహాదేవుని వంటి మహామహులను తలక్రిందులు చేయగలిగిన నేను యౌవనములో నున్న అంతమంది గోపికలలో ఒక్క గోపిక యందైనను కామ వికారమును పుట్టించలేనా!' అని ఎంచి 'నేను మహారాసకు వచ్చెదన'ని చెప్పి, గర్వముతో వెడలిపోయెను. అటు పిమ్మట శ్రీకృష్ణుడు 'ఎంత పొరపాటు చేసితిని! మన్మథునితో ఇట్టి పందెమును వేసితినే! బ్రహ్మాది దేవతలను, సౌభరి వంటి మహర్షులను తలక్రిందులు చేసిన మన్మథుడు యౌవనములో ఉన్న ఇన్ని వేలమంది గోపికలలో ఒక్కరినైనను కామవశులను చేయలేకపోవునా! అదియే జరిగినచో నేను మన్మథునకు శాశ్వతముగా దాస్యము చేయవలసినదే కదా' అని తనలో తాను విచారించెను. "ఈ విపత్కర పరిస్థితిలో నన్ను కాపాడగలవారు రాధాజీ మాత్రమే" అని తలచి కృష్ణుడు వెంటనే రాధాదేవిని మనస్సులో సంకల్పించుకొనెను. సర్వవ్యాపక మూర్తియైన రాధాజీ ఆ క్షణముననే కృష్ణుని ముందు ప్రత్యక్షమాయెను. కృష్ణుడు ఆ దేవికి జరిగినదంతయు వివరించి చెప్పి "రాధా! నన్నిప్పుడు ఈ విపత్కర పరిస్థితి నుండి ఉద్ధరించువారు నీవు తప్ప మరెవరును లేరు. హ్లాదినీశక్తి వంటి అనేక మహత్తర శక్తులు గల నీవు ఎంతటి కాముకులనైనను కామరహితులుగ చేసి రక్షింపగలవు" అని ప్రార్థించెను.

అప్పుడు రాధాదేవి కృష్ణుని మాటలు విని చిరునవ్వుతో 'కన్నయ్యా! ఇంతచిన్న విషయమునకే నీకు ఇంత కలవరమేల? నీకు ఎట్టి విపత్తుగాని, అవమానముగాని కలుగుకుండ నేను నిన్ను కాపాడెదను' అని పలికినది.

మహారాస ప్రారంభమయినది. మన్మథుడు తన ప్రతిజ్ఞ నెరవేర్చుకొనుటకై పంచబాణములను ప్రయోగించెను. అదేసమయమున రాధాజీ తనహ్లాదినీశక్తిని ప్రసరింపజేసి మన్మథునే ఓడించెను. గర్విష్ఠుడయిన మన్మథుడు ఏ ఒక్క గోపిక యందును కామవికారమును

కలిగింపలేకపోయినాడు. ఆహా! హ్లాదినీ శక్తి స్వరూపమయిన రాధయొక్క మహిమను ఎవరు వర్ణింపగలరు? క్రమముగ హ్లాదినీ శక్తి మహిమవలన గోపికల హృదయములలో మన్మధుడు మోహమును కల్గింపజేయలేకపోగా అతనికే హృదయములో శ్రీ కృష్ణుని యందు మోహము కల్గినది. ఇదియే రాధాజీ అద్భుతలీల. అతడు తన ఓటమిని అంగీకరించి శ్రీ కృష్ణుని పాదములకు ప్రణమిల్లినాడు. ఆ క్షణము నుండియే కృష్ణునకు మదనమోహనుడను బిరుదు వచ్చినది. అనంతరము కృష్ణుడు రాధ వద్దకు వచ్చి 'నేను ఈ దినము నుండి మదనమోహనుడనయినాను. నీవు మదనమోహనమోహినివి' అని ప్రేమతో పలికెను. ఈ విధముగా మన్మధుడే శ్రీ కృష్ణుని మోహించినట్లు లోకమునకు తెలియవచ్చినది. నేటికిని తపంబునాచరించు మహర్షులందరు శ్రీ రాధాకృపాకటాక్షమాలను స్తోత్రము చేయుచు కామబాణము నుండి రక్షింపబడుచున్నారు. ఇట్టి పరమగుహ్యామైన శ్రీరాధాశక్తి సంపత్తిని గూర్చి కృష్ణునకు మాత్రమే తెలియును.

## నరవాహనుడు

శ్రీ రాధాకృష్ణులకు కావలసినది లోకకళ్యాణము. లోక కల్యాణమును చేకూర్చుటకు సంఘమునందున్న దుర్మార్గులనూ దూరముగా నెట్టివేయవలెను. ఈ విషయములో శ్రీ కృష్ణ తత్వమేమనగా

**"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచదుష్కృతామ్"**

-- అనగా దుర్మార్గులను వినాశన మొనర్చుట, సాధువులను పరిరక్షించుట. అట్లు దుష్ట శిక్షణ శిష్టరక్షణ చేయుటకు, ధర్మసంస్థాపనము చేయుటకు శ్రీకృష్ణుడు తన సుదర్శనమును ఉపయోగించును. రాముడు, కృష్ణుడు మున్నగు అవతారపురుషుల మార్గము అదియే! ఈ మార్గము హింసాపూరితము. ఈ మార్గములో వారిచే వధింపబడిన రాక్షసులలో పెక్కుమంది పై లోకములలో పిశాచములై లోకకంటకులు అగుచున్నారు.

అది లోకకల్యాణము ఎట్లగునని రాధాజీ కృష్ణుని ప్రశ్నించినది. రాధాదేవి ఎంతటి పాతకులయిన జీవులనైనను చక్ర ప్రయోగము లేకుండ, శ్రీరాముని వలె బాణములను సంధింపకుండ, శరీరములను స్పృశింపక వారి దుష్టత్వమును, దుర్మార్గచింతనలను పోగొట్టును. అట్టి దుర్మార్గులను మహాత్ములుగనో, సాధుపుంగవులుగనో మార్చివేయుటయే నిజమైన లోకకల్యాణ మార్గమని తన ప్రేమ తత్వము ద్వారా ఒక్క కృష్ణునకే కాక లోకమునకంతటికిని ఆ తల్లి చాటి చెప్పినది.

ఒకప్పుడు శ్రీధామమైన బృందావనము కొందరు బందిపోటు దొంగలకు ఆలవాలమయినది. ఒక సంప్రదాయ కుటుంబములో జన్మించిన నరవాహనుడను వాడు దుస్సాంగత్యముచే బందిపోటు దొంగగా మారి దొంగలకు నాయకుడై, ఆపై రాజ్యమును స్థాపించి క్రూరుడైన రాజుగా పేరుగాంచెను. చైతన్య మహా ప్రభువునకు సమకాలికుడైన ఈ నరవాహనుడు వేలాదిమంది దుర్మార్గులను చేరదీసి, వారికి తుపాకి ప్రయోగముతో ఆధునిక యుద్ధ విధానములను నేర్పెను. అక్బరు చక్రవర్తి కూడ వాని జోలికి పోవద్దని తన భటులను ఆజ్ఞాపించెను. ఆనరవాహనుడు అంతటి శక్తి మంతుడయ్యెను. అతడు మహాదుర్మార్గుడై వ్రజవాసుల వద్ద పన్నులు వసూలు చేయుచుండెను. వ్రజవాసులనేకులు నరవాహనునకు కప్పము చెల్లించలేకపోవుటచే వారి గృహము లెల్ల తగుల పెట్టబడినవి. ఆతని దుశ్చర్యల వలన వేలాది మంది స్త్రీలు విధవలై విలపించుచుండిరి. అనేక మంది పిల్లలు అనాథలై అన్నాహారములు లేక మలమల మాడుచుండిరి. ఆహా! ఎటువంటి పుణ్యభూమికి, ఎంతటి మహత్తర తపోవనమునకు ఎట్టి దుస్థితి కలిగినది!

ఈవ్రజవాసుల యొక్క దుర్భర బాధలను గూర్చి నారదమహాముని రాధాదేవికి విన్నవించెను. వ్రజవాసుల కష్టములను తెలిసికొనిన వెంటనే ఆతల్లి మూర్ఛిల్లినది. ఆసమయములో కృష్ణుడు అచటికి వచ్చి ఆమె పై

పన్నీరు జల్లి ఆమెను సేద తీర్చెను.

రాధాజీ పాటించులోక కల్యాణ విధానము వేణు మార్గము. సుదర్శన మార్గము కాదు. తన వేణు మార్గమెట్టిదో లోకమునకు తెలియజెప్పుటకై రాధాజీ నిశ్చయించుకొని 'కన్నయ్యా! నా వేణువును నాకిమ్ము' అనుచు వేణువును తీసికొనెను. శ్రీ రాధాకరకమలములను అలంకరించిన వెంటనే వేణువు తన నిజరూపమగు రాధాసఖిగా మారిపోయినది. శ్రీరాధ ఆసఖియను చూచి 'సఖీ! నీవు ఇప్పుడు భూలోకమునకు వెళ్ళవలసియున్నది' అని చెప్పుటతో ఆ సఖియ 'ఆలోకమునకు నేను పోలేనమ్మా! నేను ఏ పాపము చేసితినని నన్నాలోకమునకు పంపించుచున్నావు?' అని దు:ఖించినది. అప్పుడు 'నీకు భయమేల? నేను ఎప్పుడును నీతోనే యుందును కదా' అని శ్రీరాధ ధైర్యము చెప్పినది. ఆసఖియే హితహరివంశగా భూమికి దిగి వచ్చినది. మిగిలిన సఖియలు ఆమెకుమంగళహారతులిచ్చి భూలోకమునకు సాగనంపిరి.

నరవాహనుడు తన అనుచరులు కొందరిని రాజ్యమంతయు తిరిగి, ఎవరేమి చేయుచున్నారో చూచిరమ్మని పంపెను. కాని వెళ్ళినవారు ఎవరును తిరిగి వచ్చుట లేదు. ఆ వెళ్లిన అనుచరులు హితహరివంశ అను మహాత్మునకు సేవలు చేయుచున్నారనియు, ఆయనను విడిచి ఇకముందు రాబోరనియు కూడ ఆతనికి తెలియ వచ్చినది. నరవాహనుడు క్రోధోద్రిక్తుడై, 'నేను స్వయముగా వెళ్ళి అ మహాత్ముడెవరో, ఆయనశక్తి ఎట్టిదో పరీక్షించి వచ్చెదనుగాక' అని హితహరివంశ నివసించుచున్న మదన్ టేర్ అను ప్రాంతమునకు వెళ్ళెను. అచట నాహర్‌మల్ అను భక్తుడు ఆశ్రమమునకు దూరముగా కూర్చుండి బిగ్గరగా ఏడ్చుచు కనిపించెను. హితహరివంశ ఎంతటి హింసలు పెట్టియుండిన ఈతడిట్లు ఏడ్చుచుండెను' అని నరవాహనుడు అచటి వారిని ప్రశ్నించెను. అప్పుడు వారిట్లు చెప్పిరి. ' ఆ సాధువు

స్వయముగానే వంటచేసి నిత్యమును రాధాదేవికి భోగము సమర్పించును. ఆ వంటకు కావలసిన వంట చెరకు కొరకై హితహరివంశులు ప్రతి దినము మైళ్ళ దూరము నడచి వెళ్ళుచుందురు. రాధాదేవి సేవయనగా ఆయనకు ఎంత శ్రద్ధయో వర్ణింపలేము. ఆయనకు రాధాజీయందుగల భక్తిపూర్వకమైన పూర్ణమైన సేవయే నీ అనుచరుల హృదయములను మార్చి వేసినది. ఒకనాడు నాహర్‌మల్ అను ధనికుడైన ఈ శిష్యుడు ఆ మహాత్ముని జూచి "స్వామి! ఎందులకు మీ కింత శ్రమ? ఈ కట్టెల మోపులను మోయుచు మైళ్ళ దూరము నడచు కర్మయేల? రేపటి నుండియే ఒకరిద్దరు పరిచారికలను మీ వద్దకు పంపించెదను" అని చెప్పెను. వెంటనే హరివంశ ప్రభువు వానిని జూచి, "నాహర్‌మల్! ఎంతదిగజారి పోయినావు? నీ భక్తికి ఎంతటి పతనస్థితి కలిగినదోయి! రాధాదేవి నా ప్రాణము, నామానము, నాసర్వస్వము. ఆమెను సేవించుటకు పరిచారకులు కావలెనా! రేపటి నుండి నీవు నా ఆశ్రమమున అడుగుపెట్టవలదు. నీముఖమును నాకు చూపింపవలదు. ఇది నా ఆజ్ఞ!" అని పలికెను. ఆక్షణము నుండియు ఈ నాహర్‌మల్ అనుభక్తుడు ఈ విధముగ నిద్రాహారములు మానుకొని, బిగ్గరగా విలపించుచు 'నా తప్పును క్షమింపుడీ! నేటి నుండి నేను మనో వాక్కాయములతో రాధాదేవి సేవకు అంకితమయ్యెదను. ప్రభో! నన్ను మన్నింపుడు. అస్థిరమైన ఈ లౌకిక సుఖములతో నాకేమిపని? నేను ఈ లోకమునకు వచ్చినది రాధాదేవి సేవకొరకే! ఈ విషయము మరచి, లౌకిక విషయ సుఖములకు లోబడి, అమ్మకు దూరమగు చున్నాను కదా!" అని దు:ఖించుచున్నట్లు అచటివారు నరవాహనునకు తెలియబరచిరి. హితహరివంశులకు గల అనన్య రాధాభక్తిని గురించి వినిన నరవాహనుని మనశ్శరీరములందు ఏదియో ఒక అలౌకిక దివ్యశక్తి ప్రవేశించినది. ఆతని జీవితము నందు ఒక నూతనమైన మార్పుకలిగినది. ఈరెంటికి మధ్య అమ్మ అనుగ్రహము ప్రవేశించినది.

హితహరి వంశ మహాప్రభువు నరవాహనునకు రాధాదేవిని గూర్చి

బోధించుచు కొంతమంది రసిక మహాత్ముల జీవితములను గూర్చి కూడ తెలియజేసెను. ఆపై మనోబృందావనమునందలి కొన్ని లీలలను దర్శింపచేసెను.

రాధారాణి తన మహిమచే నరవాహనుని హృదయమును ద్రవీభూతము గావించినది. తన దుశ్చరిత్రను గూర్చి నరవాహనుడు చింతించి ఏడువసాగెను. ఇదియే రాధాజీలీల! నరవాహనుని హృదయమందు మహావైరాగ్యము జనించి, అతడు ఒకయోగిగా మారిపోయి, ఒక వృక్షము క్రింద కూర్చుండి తపస్సుగావించినాడు. ఈ గ్రంధకర్త రాధికా ప్రసాద్ మహరాజ్ గారు ఆ క్షేత్రము నంతయు స్వయముగా దర్శించి దివ్యాను భూతులను పొందినారు.

హితహరివంశ ప్రభువు నరవాహనుని భక్తికి, సేవాభావమునకు ముగ్ధులై తాను రచించిన 'హితచౌరాసి'' అను ప్రసిద్ధ గ్రంథమున రెండు పద్యములను భక్తునిగా మారిన ఈ నరవాహనునకు అంకితమొనర్చినారు. 'హితచౌరాసి' రాధావల్లభ సంప్రదాయమునకు ముఖ్యగ్రంథము.

## శ్రీ విఠల్‌దాస్‌జీ మహరాజ్

శ్రీహితహరివంశ ప్రభువునకు అంతరంగికభక్తుడై జీవితమును ఆయనకు అంకిత మొనర్చుకొనిన పరమ భాగవతోత్తముడు శ్రీ విఠల్‌దాస్. ఆయన ఒకదినమున తన సద్గురు వరేణ్యులయిన హరివంశజీకి పరిచర్యచేయుచున్న సమయమున ఢిల్లీ పాదుషా వద్ద నుండి ఇద్దరు భటులు గుఱ్ఱములపై వచ్చి విఠల్‌దాస్‌జీ ఎవరని అడిగితెలిసికొని పాదుషా గారి ఫర్మానాను ఆయన చేతికందించిరి. విఠల్‌దాస్ ఆఫర్మానాను చదువుకొని, పాదుషా తనను మిక్కిలి అల్లకల్లోలములతో నిండిన జూనాఘడ్ రాజ్యమునకు ముఖ్యమంత్రిగా నియమించినట్లు గ్రహించినాడు. వెంటనే ఆయన దు:ఖ పూరిత హృదయముతో సద్గురు హరివంశజీ పాదములకు

ప్రణమిల్లి 'ప్రభో! నన్ను మాయలోముంచి వేయనేల? ఈ గౌరవములు, పదవులు నాకేల? నేను హాయిగా మీ సమక్షములో రసిక భక్తుడనై ఆనందములో ఓలలాడుచుండ ఈ కష్టము నాకేల రావలయును?' అని విలపించెను. హరివంశ ప్రభువు శిష్యుని జూచి 'నాయనా! ఆ విధముగా ఎన్నడును భావింపకుము. ఇది నీకొక సంతోష వార్తయే అని నమ్ముము. అమ్మయే స్వయముగా ఒక గొప్ప వల వేయుచున్నది. జూనాఘడ్ రాజ్యమునకు చెందిన మహారాజే కాక, వేలాదిగా ఆ రాజ్యప్రజలు రాధాజీ భక్తులు కానున్నారు. క్రమముగా నీకే విషయమంతయు బోధపడును. మారు మాటాడక వెళ్ళిరమ్ము. నిన్ను విడచి సర్వేశ్వరియుండదు. ఇక నీకు భయమేల ? నీవున్నచోటే బృందావనమై అచ్చట శ్యామాశ్యాములు వసించుచుందురు. నీవు నిరంతరము వారిని ధ్యానించుచు ఈ కార్య భారమును స్వీకరించుము. అదియే నీ ధర్మము' అని ఓదార్చెను. అందుకు విఠల్‌దాస్ అంగీకరించుచు, తాను గురుముఖారవిందమును దర్శింపక, వారి ప్రసాదమును స్వీకరింపక ఎట్లు జీవింపగలనని వేడుకొనెను. శ్రీహితహరివంశ తనచిత్రపటమును తీసికొని వెళ్ళుమని చెప్పుచు ప్రతినిత్యము తాను జూనాఘడ్‌నకు అమ్మప్రసాదమును, తన ప్రసాదమును పంపుదునని వాగ్దానము చేసెను. విఠల్‌దాస్ వెంటనే తన అంగీకారమును తెలుపుచు ప్రత్యుత్తరము వ్రాసి పాదుషాకు పంపించెను.

శ్రీ రాధాజీ హ్లాదినీశక్తి ప్రభావము చేత విఠల్‌దాస్ వివేకము, పరిపాలనా దక్షత వెయ్యింతలై కొలదికాలములోనే రాజ్యమంతయు శాంతి కిరణములచే నిండిపోయెను. ఎవ్విధమైన వివాదములు కాని, అంతర్యుద్ధములు కాని లేకుండెను. పాదుషా మహామంత్రిని వేనోళ్ళపొగడెను. అనతికాలములోనే విఠల్‌దాస్ ప్రజలందరికి ప్రేమాస్పదుడాయెను. సర్వులు ఆయనను ఆశ్రయించుచుండిరి. ఆరాజ్య ప్రధాన న్యాయమూర్తి ఇది చూచి సహింపలేకపోయెను. స్వల్పకాలములోనే విఠల్‌దాస్ సంపాదించిన

అపూర్వమైన పేరు ప్రతిష్ఠలకు ఓర్వలేక అసూయాగ్రస్తుడై అతడొక కుట్రను పన్నెను. ప్రజలలో ఒక విప్లవమును లేవదీసి 'ముఖ్యమంత్రి రాజద్రోహి, ఈ రాజ్యములో ఉండతగడు. మహారాజు వెంటనే విచారణ జరిపించి వానికి తగిన శిక్షను విధింపవలెను. రాజ్యప్రజలందరును ఇదియే కోరుచున్నారు' అనుచు ఒక అభియోగ పత్రమును తయారుచేసి మహారాజునకు పంపెను. రాజు ఆశ్చర్యముతో ధర్మతత్పరుడైన విఠల్‌దాస్ చేసిన నేరమేమని ప్రశ్నించెను. 'విఠల్‌దాస్ ఇప్పటివరకు ఒక్కనాడైనను ప్రభువుల కులదైవము, చతుర్భుజుడునైన ద్వారకాధీశుని దర్శింప లేదు. గురువే దైవమను చుండును. అవైదికముగ ఆగురువు యొక్క 'ఎంగిలి' భుజించుచు, ఆ ఎంగిలిని గురు ప్రసాదమను పేర నిత్యము వ్రజధామము నుండి తెప్పించుకొనుచుండును. ఈ కారణములచే ద్వారక నుండి వచ్చిన ప్రతినిధి మండలి అచ్చటి ప్రజల హృదయములలో ద్వారకాధీశుని పట్ల అవిశ్వాసమును కలిగించుచున్న ఈ నీచుని దండింపగోరుచున్నారు' అని ప్రధానన్యాయమూర్తి ప్రభువునకు విన్నవించెను.

మహారాజు తక్షణము విచారణ చేయనెంచి విఠల్‌దాస్‌ను సభకు పిలిపించెను. విచారణ ఎట్లుండునో చూడవలెనను ఆకాంక్షతో ప్రజలు తండోపతండములుగా సభాస్థలికి వచ్చిరి. మోకాలివరకు వస్త్రమును ధరించి విచారణకు వచ్చిన విఠల్‌దాస్‌తో రాజు "నీ విప్పుడు ముఖ్యమంత్రివి కావు, ముద్దాయివి. కావున నీకు నిత్యము నా ప్రక్కన వేయు ఉన్నతాసనమునొసగుటలేదు" అని పలికెను. విఠల్‌దాస్ రాజు నిర్దేశించిన ప్రదేశమున నిలువబడెను. అంతట ఆతనిపై వచ్చిన ఆరోపణలను చదివి, మహారాజుల కులదైవమైన చతుర్భుజ గోపాలుని ఆలయమునకు వెళ్ళకుండుట రాజధిక్కార నేరమని ఆరోపించిరి.

ప్రజలు ఆరాధించవలసిన దేవత ఎవరు అన్న విషయమును వారికి తెలియజేయుట కొరకై అమ్మ ఒక పెద్దవలను పన్నినది.

తనపై ఆరోపింపబడిన రాజధిక్కార నేరమును విని విఠల్‌దాస్ 'ఇది పరిపాలనకు సంబంధించిన నేరము కాదు. ఈ లోకము నందలి ప్రతిజీవుడును తన ఇష్టదేవతను నిర్ణయించుకొని ఆరాధించుటకు హక్కు కలిగియున్నాడు. నాది రాజధిక్కారమెట్లగును? నా యిష్ట దేవత ద్విభుజ కృష్ణుడు. రాధాకృష్ణయుగళమూర్తి ఐన ఆయనతో సమానమగు దైవమెందును లేదు అని వేద వేదాంగములే చెప్పుచున్నవి. ద్విభుజకృష్ణుడనగా ప్రత్యక్ష బృందావనేశ్వరుడు. ఏరసిక భక్తుడు ఈ బృందావన దివ్యమూర్తిని ఆరాధించునో వాని శరీరము ఒక దివ్యమయిన, తేజోవంతమయిన, రసమయిమయిన దివ్యధామమగు బృందావనముగ మారిపోవును' అని ప్రకటించెను. అప్పుడు మహారాజు వేదశాస్త్రములు, నీ జవాబు అట్లుండనిమ్ము. నీవు చెప్పినది ఈ ప్రజలందరకు అర్ధమగునట్లు నీ శరీరము నందే క్రియారూపములో బృందావన ధామమును చూపింపగలవా? అట్లు చేయని యెడల నీకు శిక్ష తప్పదు'' అనెను.

అప్పుడు విఠల్‌దాస్ తన రెండు చేతులను పైకెత్తి అమ్మను ప్రార్థించినాడు. ''జైరాధారాణీ! జైరాధామహారాణీ! సత్యమేదో వీరికి నిరూపించవమ్మా! ఈ పామరులకు ఆనిత్య బృందావనము నొక్క సారి చూపవమ్మా!'' అనుచు ధ్యాన మగ్నుడై నిలువబడెను.

మహాద్భుతము! అచట విఠల్‌దాస్ లేడు. ఆతని స్థానమున ప్రజలందరికి శ్రీధామమైన బృందావనమే మహాశోభాయ మానముగ దర్శన మిచ్చెను. అచట ఒక వైపు నుండి దేవతల మధురాతి మధురమైన గానము, మరియొక వైపు నుండి పక్షుల కిలకిలారావములు వినబడుచున్నవి. ఇంకొక వైపు మధుర కంఠములతో రాధానామ సంకీర్తనము జరుగుచున్నది. మరికొంత సేపటికి అత్యంత మధురమైన వేణుగానము వినబడసాగినది. రాసలీలాధ్వనులు శరీరములను పులకింపజేయుచున్నవి. కుంజలతల మధ్య

సఖీగణ పరివేష్టితయైన రాధా మహాదేవికి హారతి నిచ్చుచున్న హితహరివంశజీ దర్శన మిచ్చిరి. మహారాజు ఆ దివ్యదృశ్యమును తిలకించి చైతన్యము తప్పి మూర్ఛిల్లెను. ప్రజలందరు విఠల్ దాస్ మహాశయుని పాదపద్మములకు ప్రణమిల్లి 'జై బృందావన్' 'జైబృందావన్' అనుచు ప్రేమాశ్రువులు కార్చుచు విలపింపసాగిరి. కొంతసేపటికి మహారాజు మేల్కొని విఠల్‌దాసునకు సాష్టాంగ నమస్కారము చేసి 'నా వైష్ణవాపరాధమును మన్నింపుడు. బృందావన ధామమునకు మించిన శ్రీధామమెందును లేదు. బృందావనేశ్వరి శ్రీ రాధారాణిని మించిన రస స్వరూపిణి యగు సర్వేశ్వరియు ఎందును లేదు. ఈ బృందావన్ దృశ్యము వలన మేమందరము ధన్యుల మయినాము' అనుచు ప్రజల జయజయధ్వానముల మధ్య ప్రకటించెను. "మహాత్మా! రాజ్యనిర్వహణకు సంబంధించిన పత్రములపై మీ సంతకము నేనే స్వయముగ వచ్చి తీసికొందును. నేను బాహ్యమునకే రాజును. నాకును మీకును ఏలిక ద్విభుజ మూర్తి అయిన రాధాకృష్ణులే! ఇది నా ప్రమాణ వాక్యము" అని మహారాజు భక్తి భావసంభరితుడై పలికెను. అప్పుడు ప్రజలందరును జేరి 'హే రాధే గోవింద ! హే రాధే గోవింద ! హేరాధే! హేరాధే! అని జయజయ ధ్వానములు చేసిరి.

ఒకనాడు రాత్రి రెండవ జామునకు కూడ విఠల్‌దాసునకు గురుపాదుల వద్ద నుండి ప్రతి నిత్యము నియమానుసారము లభించు చుండు ప్రసాదము రాలేదు. విఠల్‌దాసు ఆతృతతో గుమ్మము వంకచూచుచు 'గుర్రము లింకను రాలేదెందులకో! ఎప్పుడు ఇంత ఆలస్యము కాలేదే!. ప్రభో! నాకేలనో భయమగుచున్నది' అనుకొనుచు దిక్కులు చూచుచుండెను. అంతలో గుర్రపుడెక్కల ధ్వని వినిపించగా పరుగున ముందునకేగి 'నాగురుదేవులు క్షేమమేకదా! ఏదీ ప్రసాదము' అని విఠల్‌దాస్ ప్రశ్నించెను. గుర్రములపైనుండిదిగిన భక్తులు 'ఈదినము ప్రసాదము లేదు. ఇక రేపటినుండి కూడ ప్రసాదము లభింపదు' అని విలపింపసాగిరి. విఠల్‌దాస్

వారిని సమీపించి 'సోదరులారా! వెంటనే చెప్పుడు. గురుదేవులెట్లుండిరి? 'అని ఆత్రుతతో ప్రశ్నించెను. 'మన గురుదేవులింకలేరు. శ్రీదేవి స్వయముగా వచ్చి 'హితసఖీ' అని పిలచుచు ఆయునను తన దివ్యధామమునకు తీసికొనిపోయినద'ని చెప్పుచు ఆభక్తులు మూర్ఛిల్లిరి. విఠల్‌దాసు చేతులెత్తి నెత్తిపై పెట్టుకొని అట్లే నేలపైకి ఒరిగెను. అచ్చటనేయున్న మహారాజు, వైద్యశిఖామణులును ఆయనను పరీక్షింపగా 'విఠల్‌దాసు ఇంక లేరు' అను కఠోర సత్యము తెలిసినది.

## శ్రీ జీ జైపూర్ లీల

ఒకప్పుడు శ్రీరాధాభక్తుడైన జైపూర్ మహారాజు శ్రీజీ పీఠాధిపతిని తన నగరమునకు ఆహ్వానింపగా, ఆయన 'మహారాజా ! నీ ఆహ్వానమునకు సంతోషము. కాని లౌకిక సుఖములలో ఓలలాడుచున్న ప్రాపంచిక జనులు వసించు గృహములలో మేము అడుగుపెట్టమని నీకు తెలియదా ? మేము రావలెనన్నచో మీ మహలుకు ఐదుమైళ్ళ దూరములో ఒక ప్రత్యేక గృహమును నిర్మింపుము. అచట విడిది చేసెదము' అని పలికెను. మహారాజు అట్లే ప్రత్యేక విడిది గృహము నేర్పాటు చేసెను. అప్పటికి శ్రీరాధా భక్తులందరికి సద్గురుమూర్తియైన పీఠాధిపతిగా అత్యంత సౌందర్య, సౌకుమార్యములతో నొప్పుచుండెడి ఒక యువకుడు ఉండెడివాడు. ఆయన వయస్సులో పిన్న, యోగశక్తిలో మిన్న. ఆయోగి పుంగవుడు తన వసతి గృహములో విడిదిచేసియున్న రోజులలో ఒకరోజు జైపూర్ మహారాజుగారి అంతఃరపురస్త్రీలు మరికొందరు సామంతరాజుల స్త్రీ జనములతో కలిసి అనేక సుగంధ పుష్పమాలికలను, మధుర పదార్థములను తీసికొని ఆ స్వామిని సేవించుటకై వెడలిరి. ఏదో ఒకానొక వర్ణనాతీత దివ్యశక్తి ప్రేరణవలన (ఆ శక్తియే శ్రీ రాధాదేవి) ఆసుందరాంగులందరును పీఠాధిపతియగు ఆ యువకుని నృత్యగానాదులతోను, పుష్పమాలికలతోను, సుగంధ

ద్రవ్యములతోను సేవింపసాగిరి. మరికొందరు ఆనందపారవశ్యముతో ఆయన పాదములకడ మూర్ఛిల్లిరి. ఇట్లు కొన్ని గంటలపాటు అచట ఒక దివ్యరాసలీల జరిగినది. ఆ సమయమున క్షత్రియయువకులు కొందరు మహారాజును సమీపించి రాజపుత్ర స్త్రీలట్లు అనుచితముగా ప్రవర్తించుచుండ వారిని వారింపవలదా అని ప్రశ్నించిరి. వారట్లు పల్కుచుండగనే యువకుడైన పీఠాధిపతి అదృశ్యుడై, ఆస్థానములో సమస్త లోకములలో నెచటను కానరాని దివ్య సౌందర్యముతో నొప్పు 12 సం॥ల సుందర బాలికా స్వరూపము ప్రత్యక్షమాయెను.

**"ఓ రాజా ! అనేక జన్మలు తపమాచరించినను జీవునకు మా దర్శనము కాదు. లోకారాధ్యులగు దేవతలు కూడా మా దర్శనము లభింపక అనేక విధములుగ దుఃఖించుచుందురు. మీ స్త్రీలందరు అబలలై, నిస్సహాయులై యుండగ, లోకజననినగు నేను వారినెట్లు విడచియుండగలనని నీవు అనుకొనుచున్నావు ? మూర్ఖుడా ! నా దృష్టిలో పురుషులనుచు ఎవరును లేరు. నిజమునకు ఆ పీఠాధిపతి రూపమున అంతర్యామిగా ఉన్నది నేనే ! నా నిజస్వరూపము శ్రీ రూపము. నేనే శ్రీదేవిని. విశ్వమునందలి ఐశ్వర్యమంతయు నా స్వరూపమే. ఈరేడు లోకములందలి శక్తి, సౌందర్యము, శోభ మున్నగునవన్నియు నా స్వరూపమే. యోగుల హృత్పద్మములందు వసించు పరమ యోగ స్వరూపమును నేనే! మీరందరు ఆరాధించుచున్న శ్రీకృష్ణుని ఆరాధ్యపరదేవతను నేనే ! ఇంతవరకును మీ రాజ్యముపై దండెత్తక మహమ్మదీయ చక్రవర్తులు దూరదూరముగ నుండునట్లు చేసినదియు నేనే !**

**నా భక్తులు నిరహంకారమూర్తులు. అట్టి నిరహంకార జీవిత పుష్పములే నా పాదములనంట గలవు. మీ మహలునందలి స్త్రీలందరును నిరహంకారులై సదానన్నే తలచుచున్నందున వారికి**

**దర్శనమీయదలచి, వారి కొరకే ఇక్కడకు వచ్చితిని. నా హ్లాదినీ శక్తి మహిమచే ఈ నారీమణులందరిటకు ఆకర్షితులైరి. వీరు నా చుట్టును చేరి తమ నృత్యగానాదులతో సేవించుటకు కారణము నా హ్లాదినీ శక్తియే. ఈ జగత్తుకు పూర్వముననున్న ఆదిశక్తినే బ్రహ్మాదులు శ్రీ అని పిలుచుచున్నారు. ఆ శ్రీని నేనే ! ఈ కారణముననే శ్రీ కృష్ణుడు నన్నారాధించుచున్నాడు''** అను సర్వేశ్వరి పలుకులనాలకించిన రాజపుత్రులందరు అమ్మపాదములపై సాష్టాంగపడి, మన్నింపుమని ప్రార్థించిరి. 'అమ్మా ! మేము నేడే బృందావనమునకు వెళ్ళి, అచట ఒక మహాదివ్యభవనమును నిర్మింతుము. అందు నీ పవిత్ర మూర్తిని ప్రతిష్ఠించి, నిన్ను మా మహారాజ పురదేవతగా మా యావత్సంపదకు మూలకారణముగా భావించి సేవించుకొందుమని నీ పాదములకడ ప్రతిజ్ఞగైకొనుచున్నాము. జై జై శ్రీమాతా!' అని దశదిశలు మారుమ్రోగునట్లు ఆ రాజకుమారులు నినదించిరి. అప్పటి నుండి ఆ పీఠము పేరు శ్రీజీ పీఠము అనియు, ఆ పీఠాధిపతిని శ్రీజీమహరాజ్ అనియు పిలచుచున్నారు. దేశమందంతట వ్యాపించుచు అమ్మకు అంకితమైన ఆలయములను శ్రీ మందిరములనుచున్నారు. కనుకనే కృష్ణుడు

**"కృష్ణంవదంతి మాం లోకాన్త్వయైవ రహితం యధా**

**శ్రీకృష్ణంచ సదా తేపి త్వయైవ సహితం పరమ్"॥**

"నీవులేని నన్ను కృష్ణుడందురు. నీతో కూడియున్న నన్ను శ్రీకృష్ణుడందురు' అనుచు తన సిరియు, సంపదయు రాధాజీయే అని లోకమునకు చాటిచెప్పెను.

# అధ్యాయము-4

# శ్రీరాధా పరమేశ్వరీ అనుగ్రహమును పొందుట ఎట్లు?

# ఏది నిజమైన సాధన ?

సాధనయనగా గ్రంథములు చదువుట కాదు. నదీ స్నానములు కాదు. తీర్థక్షేత్రముల దర్శనమును కాదు. ధ్యానసమయమున హృదయములో తలెత్తిన కామ్యచింతనలను, విషయభోగ వాసనలను ఎప్పటికప్పుడు అణచి వేయుటయే నిజమైన సాధన.

**'కామయేష క్రోధయేష రజోగుణ సముద్భవ:'** - కామక్రోధములు రజోగుణము నుండి పుట్టుచున్నవి. దేహములోని అణువణువునను రజోగుణము నిండియుండును. కనుక రజోగుణము నుండి పుట్టు కామక్రోధములు జీవుని వశము చేసికొని ఆడించుచుండును. కామవశుడైన జీవుడు తన దివ్యశక్తులనన్నింటిని కోల్పోయి దీన దశకు వచ్చును. అట్టి జీవుని ఉద్ధరించి నివృత్తి మార్గములో ప్రయాణింపచేయగల మహాయోగశక్తి ఏదైనను ఉన్నదా ?

ఉన్నది. అదియే నిరవధిక శ్రీ రాధా ధ్యానము. ప్రచండ మాధుర్యశక్తియైన రాధాజీని అనుక్షణము ధ్యానించు ధన్యులకు ఆధ్యాత్మిక సాధన నల్లేరు మీద బండి నడక వలె ఉండును.

**" మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయో:"**

బంధమునకు, బంధ విముక్తికి కూడా మనసే కారణము. ఆధ్యాత్మిక సాధనా సమయములో బంధమునకు కారణమైన మనస్సు యొక్క అధోభాగము అడుగడుగునను అడ్డుతగులుచు క్రిందికి లాగి వేయుచుండును.

శ్రీరాధ " భక్తానుగ్రహకాతర" యని స్తుతియింపబడినది. ఇది అక్షరసత్యము. ధ్యానమును నిరంతరము కొనసాగించగలుగు శక్తిని ప్రేమతో

అమ్మయే ఎల్లప్పుడు అనుగ్రహించుచుండును. రాధాజీయొక్క అనుగ్రహశక్తియే పతనమగుచున్న మనసును ఊర్ధ్వముఖముగా త్రిప్పివేయును. శ్రీ రాధాజీ అనుగ్రహమును పొందిన జీవుల చైతన్యమును ఆతల్లి ఊర్ధ్వగతికి పంపించుచుండును. మధురరసమును సాధకునిలో జనింపచేయుచుండును. ఈ రెండును అమ్మయొక్క అనుగ్రహలక్షణములు. అమ్మ అనుగ్రహము పొందిన వారికి ధ్యాన సాధన సరియైన మార్గములో పోవుచుండును. ప్రతి క్షణము సాధనసాగుచుండవలెను. ఎదురగు ఆటంకములను అణచివేయు చుండవలెను.

శ్రీ రాధయందు పరమ మాధుర్య స్వరూపమైన 'హ్లాదినీ శక్తి' యున్నది. అదియే మదనమోహన మోహినీ లీలయందు వేలకొలది గోపికల మనస్సులను నియంత్రించి కృష్ణభావుకులుగ మార్చివేసినది. మన్మధుని శక్తియైన ప్రకృతి కామశక్తిని కరగించి ఆతనిని కృష్ణకామునిగ మార్చివేసినది. ఈ దివ్యశక్తియే, శ్రీ రాధా దివ్యాను గ్రహ స్వరూపమే హ్లాదినీ శక్తి.

**'కర్మాణాం భోగతో నశ్యేత్'** - కర్మ అనుభవించిననే కాని నశింపదు. ఇందు కర్మతొలగుట, కర్మవాసన నశించుట అను రెండు విషయములు కలవు. వానిని తొలగించుకొనుట తేలిక కాదు. సౌభరి, విశ్వామిత్రుడు మొదలగు వారు సామాన్యులా? తపస్సంపన్నులైన వారే విషయ వాసనలను తొలగించుకొనలేక పతనమైనారే! మనము వారి కన్నను ఘనులమా! ఐనను భయపడవలసిన పని లేదు. కర్మభారమును కరగించి సాధనలో ఉర్ధ్వముఖముగ తీసికొని వెళ్ళగల మాధుర్యభరితమైన మార్గమే నిరంతర శ్రీ రాధా ధ్యానము.

కైశోరాద్భుత మాధురీభరధురీణాంగచ్ఛవిం రాధికామ్
ప్రేమోల్లాసభరాధికాం నిరవధి ధ్యాయంతియేతద్ధియ: ।
త్యక్తా: కర్మభిరాత్మనైవ భగవద్ధర్మేప్యహోనిర్మమా:
సర్వాశ్చర్య గతిం గతా రసమయీ తేభ్యో మహద్భ్యోనమ: ॥

భావము :

అద్భుత మాధురీ తరంగములను దశదిశల ప్రవహింపచేయుచున్న నిత్యకిశోర స్వరూపము శ్రీరాధాదేవి. అట్టి రాధాజీని నిరవధికముగా ధ్యానము చేయు మహనీయులను కర్మ తనంతట తాను వదలివేయును.

శ్రీ రాధా దివ్యమాధుర్యశక్తియే ఊహించలేని దుష్కర్మలను చేసిన నరవాహనుని కొద్ది క్షణములలో మార్చి వేసినది. రాధా ధ్యాన మార్గములో శ్రీ రాధా అను గ్రహమును పొందిన పుణ్యజీవులకు కర్మతొలగిపోవుట, మనసులో మాధుర్యభావము పెరుగుట, అమ్మపట్ల అనురక్తి క్షణక్షణమునకు వృద్ధిపొందుట జరుగును. నరవాహనుని విషయములో ఇదియే జరిగినది.

వేదమునకు అతీతమైన శ్రీ రాధా ధ్యానయోగము సాక్షాత్తు శ్రీకృష్ణునిచే సదా అనుష్ఠింపబడుచున్నది.

**'కృష్ణేన ఆరాధ్యతేతి రాధా'** - శ్రీ రాధ కృష్ణునిచే సదా ఆరాధింపబడుచున్నది. ఆయన రాధాధ్యానములో నిమగ్నుడై అనిర్వచనీయమైన ఆనందమును పొందుచుండును.

**కాళిందీ తటకుంజ మందిరగతో యోగీంద్ర వద్యత్పద**
**జ్యోతిర్ధ్యాన వర: సదాజపతి యాం ప్రేమాశ్రు పూర్ణోహరి :**
**కేనాప్యద్భుతముల్లసద్రతి రసానందేన సమ్మోహిత:**
**సారాధేతి సదాహృది స్ఫురతుమే విద్యావరాద్వ్యక్షరా ॥**

రాధా సుధానిధి

**శ్లో॥ 95**

స్వయముగ శ్రీ కృష్ణుడు ఒక యోగీంద్రుని వలె పద్మాసనస్థుడై కన్నుల వెంట ఆనందాశ్రువులు జాలువారుచుండ పరావిద్యాస్వరూపమైన "రాధ"యను రెండు అక్షరములను నిరంతరము ధ్యానించు చుండును.

శ్రీ కృష్ణుడే మనకు ఈ ధ్యానములో మార్గదర్శకుడు. శ్రీ రాధా ధ్యానములో కృష్ణుడు ఒకానొక అనిర్వచనీయమైన రసానందము చేత

సమ్మోహితుడగుచుండును. కృష్ణదాస కవిరాజగోస్వామి వ్రాసిన చైతన్య చరితామృతము, ఆదిలీలలో కృష్ణుడు చేసిన చింతనము కూడ ఆయన ఎంతటి రాధా భక్తుడో స్పష్టము చేయుచున్నది. 'అన్ని లోకములకు నేను ఆనందమును అనుగ్రహించుచుంటిని. కాని నాకు ఆనందము నిచ్చునది మాత్రము ఒక్క రాధా దేవియే!' అని కృష్ణుడు రాధాజీని ధ్యానించినట్లు ఆదిలీల స్పష్టము చేసినది.

రాధాజీ సర్వలోకములు నిండియుండిన ఒక అఖండ అనంత తేజోమూర్తి. ఎవరు క్షణమైనను విరామము లేకుండ అవధి లేని ఒక మహానదీ ప్రవాహము వలె "రాధారాధే" అనుచు నామము చేయుదురో అక్కడ తాను ఉండెదనని అమ్మ మనకు మాట ఇచ్చినది. సర్వత్ర నిండియున్న భగవంతుని దర్శించుచుండు ప్రహ్లాదుని దివ్యచరిత్ర కూడ భగవన్నామమును విరామము లేకుండ జపించు చుండు జీవుని భగవంతుడు క్షణమైనను విడువక వెన్నంటి యుండునని చాటిచెప్పెను.

**శ్రీరాధా అనుగ్రహమును పొంది తరించిన మహాత్ములు :**

## రసిక భక్త రెహమాన్ బాలుని అపూర్వ రాధాభక్తి

శ్రీరాధా నామామృత మాధుర్యమును గ్రోలిన రెహమాన్ అను ఒక ముస్లిమ్ బాలుని రసమయ గాథ కూడ నిరవధికముగ రాధాజీని ధ్యానించువారిని ఆ తల్లి క్షణమైనను విడువక ఎట్లు వెన్నంటియుండునో లోకమునకు స్పష్టము చేసినది. 8,9 సంవత్సరముల ఆ బాలుడు తనకు తెలియకుండగనే 'శ్యామా, శ్యామా !' అని ప్రవాహమువలె మనస్సులోననే ధ్యానము చేసెడివాడు.

ఒక జీవుడు ఏ మతమునకు చెందినను, ఏ సంప్రదాయమునకు చెందినను ఎంత చిన్న వయస్సు కలవాడయినను, వానికి పూర్వజన్మ ఆధ్యాత్మిక సంస్కారము ఉన్నచాలును. కొద్దికాలమయినను అమ్మ యొక్క

సేవాభాగ్యమును వాడు సంపాదించినచాలును. అమ్మ అట్టి జీవిని విడువదు. ఒక లేగదూడ తల్లిని విడచి దారి తప్పిపోయినప్పుడు తల్లి ఏవిధముగా ఆరాటముతో తన లేగదూడ కొరకై వెదకుచుపోవునో అదే విధమున ఆ మహమ్మదీయబాలుని రాధారాణి తన వైపునకాకర్షించుకొనుట బృందావన ధామములో జరిగినది. ఈ జన్మలో వాడు బాలుడు కాని , గతజన్మలో వాడు ఎంతటి గొప్ప సంస్కారియో మనకు తెలియదు గదా! ప్రహ్లాదునివలె చిన్న వయస్సునందే మహత్తర వైరాగ్యమును కలిగి ఆబాలుడు ఏ విధముగా రాధాజీ కొరకై గృహత్యాగమును చేసి,నిశీధసమయములో అష్టకష్టములుపడి బృందావన ధామమునకు పయనమైపోయెనో ప్రతి జీవుడు తెలిసికొనవలెను. వాని జీవిత ఘట్టమును పాఠక మహాశయులకు ఇచ్చట సమర్పించుచున్నాము.

బృందావనమునకు సమీపముననే మధురానగరమను పట్టణమున్నది. ఒకప్పుడు ఈ పురము రాక్షసస్వభావుడగు కంసునకు రాజధాని.

ముసల్మాన్ నాయకుడగు మీర్జాసాహెబ్ ఆ పురమునందే నివసించు చుండెడివాడు. ఆతనికి సుమారు తొమ్మిది సంవత్సరముల వయస్సుగల ఒకే ఒక పుత్రుడుండెడివాడు. ఆ పిల్లవానికి హిందూ మతమును గూర్చికాని, హిందూమత సంప్రదాయములను గూర్చికాని ఏమియు తెలియదు.

ఒక నాడు బడి విడచిన పిదప ఇంటికి పోవుచుండ దారిలో తెరువబడియున్న ఒక రాధా మందిర కవాటము నుండి కనబడుచున్న రాధాదేవి పాలరాతివిగ్రహముపై వాని కన్నుపడినది. ఆ రాధావిగ్రహము సుందరముగా అలంకరించబడియున్నది. పిల్లవాని చూపు రాధా విగ్రహము నందును, రాధాదేవి చూపు పిల్లవాని యందును పడినవి. 'నావద్దకురా' అనుచు రాధాదేవి కనుసైగచేసినట్లు ఆ బాలునకు ఆ తల్లి సంకల్పము

వలన ఒక భావము కలిగినది. వెంటనే 'ఈ విగ్రహము పేరేమి? నాకు చెప్పరా' అని ఇంటి యజమానిని బాలుడు ప్రశ్నించినాడు. 'ఈ తల్లి పేరు శ్యామాదేవి. గొప్ప దేవత. మేము ఈమెను ఎంతోగారాబముగ 'శ్యామా శ్యామా' అనుచు ఆరాధించుచుందుము' అని చెప్పుచు "ఇదిగో ! అమ్మవారి ప్రసాదము తీసికొనుము"అని మందిర అర్చకుడు దేవీ ప్రసాదమగు నేతి మిఠాయిని రెహమాన్ బాలుని చేతిలో పెట్టిరి. ఆ ప్రసాదమును తినుచు ఆ బాలుడు ఇంటికి బయలుదేరెను. అట్లు వెళ్ళుచుండగనే వాని మనస్సు అమ్మ మీదకు పూర్తిగ మరలినది.రాధాదేవి ఏనాడు ఏజీవుని తన భక్తునిగా ఎన్నుకొనునో ఎవరును చెప్పలేరు. ఆ బాలుడు అమ్మమూర్తిని దర్శించుకొని, అమ్మ యొక్క దివ్య ప్రసాదమును భుజించిన క్షణము నుండియు ఆతని శరీరములో అమ్మ తేజస్సు ప్రవేశించినది. హృదయము ఏ ఆలోచనయు లేకుండ అమ్మభావముతో పూర్తిగనిండిపోయినది. అతని మనస్సు అమ్మనామ రూపములకు పూర్తిగా అమ్ముడైపోయినది. కారణము తెలియకుండగనే ఆబాలుని నేత్రములనుండి అశ్రువులు కారుచుండెను. అతడు శ్యామానామమును క్షణమైనను విడువలేకుండెను. వాడు ఎవరితోను మాటాడక, ఇంటిలో ఒక మూల కూర్చుండి కన్నులు మూసికొని 'శ్యామా శామా' అనుచు అమ్మ నామమును అత్యంత ప్రీతితో చేయసాగెను. వాని విచిత్ర వైఖరిని చూచిన తల్లి "అల్లాహు నామమును మరచి ఈ క్రొత్త నామమును చేయుచున్నావేమిరా? మీనాన్న చూచినచో నావలె మౌనముగా నుండడు. నీ చెంపపగులగొట్టనిదే ఊరుకొనడు" అని పలికెను. అంతలో వాని తండ్రి వచ్చెను. వీని విచిత్ర వైఖరిని చూచి, ఈ కాఫర్ల నామము నీకు ఎక్కడి నుండి వచ్చినదిరా అనుచు పిల్లవాని వీపుపై నాలుగు దెబ్బలు గట్టిగా కొట్టెను. 'వాడే ఈ నామమును మానుకొనునులెండు. కొట్టకుడు' అని తల్లి వారించినది. ఆనాటి రాత్రి అంతయు ఆ బాలుడు నిద్రపోక వీధి అరుగుపై ఒంటరిగా కూర్చుండి 'శ్యామా శ్యామా' అనుచు నామ జపమును

కావించుచుండెను.

ఆ మరునాటి ఉదయమే తండ్రి మసీదులోనున్న ముల్లా యొద్దకు బాలుని తీసికొని పోయినాడు. ముల్లా వానిని చూచి,'వీనికి ఏదియో దయ్యము పట్టినది, నాలుగు కొరడా దెబ్బలతో దయ్యము పారిపోవును' అని చెప్పగా విని తండ్రి గుర్రపు కొరడాతో కొట్టసాగెను. ముల్లా కూడ నాలుగు కొరడాదెబ్బలు కొట్టెను. అన్ని దెబ్బలు కొట్టుచుండినను పిల్లవాడు ఏడువకుండెను. పారిపోకుండెను. శ్యామా నామమును విడువకుండెను. అది చూచి తండ్రి 'రేపు వీనికి అన్నము పెట్టకుము' అని భార్యను హెచ్చరించెను.

తల్లి పిల్లవాని చేయి పట్టుకుని లోనికి తీసికొనిపోయి'నాకు నీవు ఒక్కడివే బిడ్డవురా నాయనా! నా తృప్తి కొరకైనను ఆ నామమును మానుకొని అల్లాహు నామమును చేయుము" అని ఏడ్చుచు వానిని కోరినది. పిల్లవాడు తల్లితో ఇట్లు చెప్పెను. " ఈ నామమును ఒక్క నిమిషమైనను విడువలేకున్నానమ్మా! నాలోపల నుండి వచ్చుచున్న ఈ నామమును వినుచు ఎనలేని ఆనందమును పొందుచున్నాను. నన్నేమి చేయమందువమ్మా! ఆ నామమును విడచి నేను బ్రతుకలేను. నన్నెన్ని దెబ్బలు కొట్టినను, నాకు భోజనము పెట్టుట మానుకొనినను శ్యామా నామమును మాత్రము విడువలేనమ్మా. మీరు నన్ను చంపివేసినను ఈ నామమును నేను విడువను. నేను కూడా ఒక కాఫర్‌గానేయుండెదను. ఒక క్షణకాలము నామమును విడచినను భరింపరాని బాధను పొందుచున్నాను. ఈ కారణము చేతనే అల్లా నామము చేయలేకపోవుచున్నాను. అల్లా యందు నాకెట్టి ద్వేషము లేదు. ఈ నామము చేయుమని ఎవ్వరును నాకు చెప్పలేదమ్మా. నేను శ్యామానామమును మాత్రము విడువలేకున్నాను. నేను నోరుమూసికొనినను శ్యామానామము నాలోపల వినిపించుచునే యున్నది. నేను భోజనము చేయకపోయినను నాకు ఏవిధమైన నీరసముగాని, ఆకలిగాని లేదమ్మా.

రాత్రి పడుకొనినను నిద్దురపట్టకున్నది. మరుక్షణమున ఏమగునో నాకు తెలియకున్నది" అని రెహమాన్ కన్నీరు కార్చెను. ఇది అంతయు తెలిసికొనిన తండ్రి అల్లా నామము చేయనిచో చంపివేయుదునని బాలునితో కఠినముగా పలికి బయటకు వెళ్ళిపోయెను. కుమారుడు ఏమైపోవునో అని ఏడ్చుచున్న తల్లిని చూచి రెహమాన్ "అమ్మా! అల్లా నాకు విరోధి కాడు. ఆయన కూడ నా హృదయము నుండి వచ్చుచున్న ఈ నామమును ఒక్క క్షణమైనను నిలుపలేకున్నాడు. అయిదు దినముల నుండి తల్లిదండ్రులైన మీరు నాకు భోజనము పెట్టకున్నను, దేహమంతయు గుర్రపు కొరడా దెబ్బలతో రక్తము కారుచున్నను ఈ శ్యామా నామ మాధుర్యమును నేను విడువలేకున్నాను" అని గద్గద కంఠముతో పలికెను. ఆ మాటలకు తల్లి బిగ్గరగా ఏడ్చుచు "నీకు అన్నము పెట్టనిచో నేను మాత్రమెట్లు తినగలను ? నీతోపాటు నేను కూడ ఉపవాసమే చేయుదునురా. నీవు మాకు ఒక్కడే బిడ్డవు. నీకు ఎట్టి కష్టము వచ్చినదిరా నాయనా! మేము నీ తల్లి తండ్రులము కాము. నీతల్లి బ్రతికియుండగానే నీవు అనాథవు అయినావు" అనుచు తల్లి మూర్ఛ పడిపోయినది. తనలోపల నుండి పిల్లవానికి "నాతల్లి స్మారకము తప్పినేలపై పడిపోయినది. ఈతల్లి నాకుతల్లి కాదు. ఈ శ్యామానామమే నాకు తల్లి. ఇక్కడ నాకు శాంతి లేదు. నా ఇల్లు మధుర కాదు. బృందావనమే. తండ్రి కొట్టునేమోయని ఈ తల్లి భయపడుచున్నది. కాని ఆ తల్లి నన్ను రమ్మని ప్రేమతో పిలచుచున్నది. ఇంక నేనిక్కడ క్షణమైనను ఉండలేను" అని అనుకొనెను. అదే సమయమున "అంతయు విడచిపెట్టి బృందావనమునకు రమ్ము" అను వాక్కు బాలునకు హృదయములోనుండి వినబడెను. నేలపై పడియున్న తల్లికి మనసులో సలాము పెట్టెను. తాను నివసించుచున్న ఇంటికి సలాము చేసెను. పాపము ఆ బాలుడు శీతలవాయువులు వీచుచున్నను, ఐదు రోజులనుండి భోజనము లేకున్నను, దేహమంతయు కొరడా దెబ్బలతో వాతలు పడియున్నను, శ్యామానామమును విడువక,

కేవలము తండ్రి ఇచ్చిన కౌపీనమును ధరించి బృందావనము వైపునకు మెల్లగా నడువ సాగెను. అతనికి తల్లిదండ్రుల మీద, గృహము మీద పూర్తిగా ధ్యాసపోయినది. అట్లే నడచి, నడచి కొంతసేపటికి సుమారు 7,8 మైళ్ళ దూరములోనున్న బృందావనము చేరెను. అచ్చట యమునానది యొడ్డునకూర్చుండి' శ్యామా శ్యామా' అనుచు రెహమాన్ ఏడువసాగెను. అప్పుడు రాత్రి సుమారు రెండు గంటలు ఐయుండవచ్చును. చూచుచుండగనే ఆకాశ సీమలో వలయాకారముగా ఒక తేజస్సు గోచరించినది. కొంతసేపటికి ఆకాశములోని ఆ వలయాకారము నుండి సుమరు 12-13 సంవత్సరముల వయస్సు గల ఒక దివ్య బాలిక నది ఒడ్డునకు దిగివచ్చినది. ఆ బాలిక విలపించుచున్న రెహమాన్ దగ్గరకు వచ్చినది. ఆమెకు ఒక చేతిలో ద్రవాహారముతో కూడిన ఒక వెండి పాత్రయు, రెండవచేతిలో ఒక ఉన్ని వస్త్రమును ఉన్నవి. ఏడ్చుచున్న బాలునిచూచి "నాయనా! ఏడువవలదు. నేను శ్యామా వద్ద నుండియే వచ్చుచునాను నీకొరకే అమ్మ నన్ను ఇచ్చటకు పంపినది. ఈ పాత్రలోని ద్రవమును త్రాగుము" అనుచు పాత్రను వాని చేతిలో పెట్టెను. ఆ బాలుడు వెంటనే దానిని త్రాగివేసెను. తాను తెచ్చిన ఉన్ని వస్త్రమును అతని చెవులకు కట్టి "నాయనా! ఇప్పుడు నీకు ఎట్లున్నది" ? అని ఆ బాలిక ప్రశ్నించెను. దానికి ఆ బాలుడు 'ఇప్పుడు నీవిచ్చిన మధుర పదార్థపు మాహాత్మ్యము నాకు తెలిసినది. కొరడా దెబ్బల గాయములతో నిండిన నా శరీరము ఒక్క క్షణములో ఏ బాధలు లేకుండ మారిపోయినది. ఐదారుదినముల నా ఆకలియంతయు మటుమాయమైపోయినది. నీవు తెచ్చిన గుడ్డను నా చెవులకు కట్టినంతనే నా చలి బాధ పూర్తిగా తొలగిపోయినది. అమ్మా ! నీపేరేమి ? శ్యామా తల్లి నా యెడల చూపుచున్న ప్రేమను నూరుమంది తల్లులు కూడ చూపలేరు. అమ్మ నిన్ను నా వద్దకు పంపి, క్షణములో నా బాధలను తీర్చినది" అనుచు రెహమాన్ గుండెలు బాదుకుని ఏడువసాగెను.

అప్పుడా బాలిక చిరునవ్వు నవ్వి " నాపేరు చంపకలత. రాధాదేవి యొక్క అష్ట సఖులలో నేనొకదానను. ఇక నీకేమి కావలయునో చెప్పుము" అనెను. అప్పుడు రెహమాన్ బాలుడు " నీవు చూపిన ప్రేమను అనుభవించిన పిమ్మట అమ్మ పట్ల నా ప్రేమ మరింత తీవ్రమైనది. అట్టి అమ్మను చూడక క్షణమైనను ఉండలేను. అమ్మను చూడలేకపోయినచో ఈ యమునలో దూకి ప్రాణములను విడతును. నన్నెప్పుడు అమ్మదగ్గరకు తీసికొనివెళ్ళెదవు" అని అడిగెను.

చంపకలత బాలుని వీపు తట్టుచు " ఏడువకుము నాయనా ! అమ్మ యొద్దకు నిన్ను తీసికొని వెళ్ళుటకే నేను వచ్చినాను. రేపురాత్రి ఇదియే సమయమునకు నేను వచ్చి నిన్ను అమ్మ వద్దకు తీసికొని వెళ్ళెదను. "రాధాకుండ్' అను ఒక చెరువు ఈ సమీపముననే ఉన్నది. దాని ఒడ్డునకు పోయి అచట కూర్చుండుము. ఆ చెరువునే అమ్మగా భావించి కొందరు యోగులు ఆ ఒడ్డుననే తపస్సు చేయుచున్నారు" ప్రేమతో అని ఆ సఖి పలికినది. "అక్కా! అక్కా! నీ ప్రేమ ఎంతగొప్పది. ఎంతగొప్పది" అనుచు ఆ పిల్లవాడు ఏడ్చుచుండగనే చంపకలతా సఖి మాయమైపోయినది.

అచ్చటకొద్ది దూరములో 'ప్రమోద్ కుమార్ చటోపాధ్యాయ' అను ఒక యోగి పుంగవుడు తపస్సు చేసికొనుచుండెను. ఆయన అరవిందయోగి శిష్యుడు. ఆయన పిల్లవానిని చూచి 'నాయనా నీవెవరవు?' అని యడిగెను. ఆ పిల్లవాడు తన వృత్తాంతమునంతయు తెలియబరచెను. అప్పుడాయన పిల్లవాని వైఖరిని చూచి,

"అనేక సంవత్సరముల నుండి నేను తపస్సు చేయుచున్నాను. అయినను రాధాదేవి అనుగ్రహమును పొందలేని ఒక దీనాతి దీనుడను. ఎన్ని సంవత్సరములు చదువుకొన్నను, నాకెంత వయస్సున్నను ఏమి లాభము ? నేనింకను ఈ లోకమునందే ఉంటిని కదా ! ఆహా ! ఏమి నీ భాగ్యము !

నీకై సాక్షాత్తు రాధికాసఖియే వచ్చినది కదా!" అనుచు కంటతడిపెట్టెను.

ఆ రాత్రి గడచినది. మరునాటి రాత్రి రెండుమూడుగంటల ప్రాంతములో చంపకలతాదేవి వచ్చి బాలుని చేయిపట్టుకొని ముందు నడచుచుండగ పాండిచ్చేరి నుండి వచ్చిన ఆ యోగిపుంగవుడు మెల్లమెల్లగా నడచుచు కొంత దూరము వారిని వెంబడించెను. చూచుచుండగనే వారు మాయమైపోయిరి. సూర్యోదయము వరకును ఆ ప్రదేశము నంతయు ఎంతమంది వెదకినను రెహమాన్ కనిపించలేదు. ప్రమోద్‌కుమార్ చటోపాధ్యాయ్ అచ్చట నుండి బృందావనములోని శ్రీజీ మందిరమునకు వచ్చి, తాను తెలిసికొనిన వృత్తాంతమునంతయు వ్యాసరూపమున రచించి ఆ మందిరమునందు ఇచ్చెను. ఆ వ్యాసము సర్వేశ్వర్ అను పత్రికలో ప్రకటితమైనది.

**రెహమాన్ బాలుని జీవితములో ఎచ్చటను మానవ ప్రయత్నము కన్పడదు. ఆద్యంతము అమ్మయే, అమ్మ అనుగ్రహమే ఆ బాలుని జీవితమును నడిపించినది. ఇది రాధాజీ దివ్యశక్తులలో ఒకటి. శ్రీ రాధారాణి అనుగ్రహమును పొందిన జీవులకు ఆధ్యాత్మిక ప్రగతిలో ఏ అడ్డంకులును ఉండవు. అట్టివారిని కర్మబంధింపజాలదు. అనన్య నిష్ఠతో, ప్రేమ భక్తితో తనను శరణు పొందిన రసిక భక్తులకు కర్మలను తొలగించి రాధాదేవి వారిని తన నిత్య నికుంజ లీలలోనికి స్వీకరించును.** ఈ దివ్య సత్యమును బాల రెహమాన్ వృత్తాంతమే కాక, శ్యామానందజీ, గులాబ్ బాబా, మహారాజా కులచంద్ర వంటి రసిక మహాత్ముల జీవితములు కూడ స్పష్టము చేయుచున్నవి.

## శ్యామానందుడు

శ్రీ బృందావనము నందు ప్రేమభక్తికి చెందిన సంప్రదాయము లనేకములున్నవి. అందు శ్యామానంద సంప్రదాయమునకు

మూలపురుషుడును, రసికభక్తుడును అయిన శ్రీ శ్యామానందుని జీవిత చరిత్ర అత్యంత పావనము, సుందరము. యుగళమూర్తి సేవలో జీవితమును పునీతము చేసికొని, సాధకలోకమునకు మార్గదర్శనము చేసిన మహనీయుడు ఆయన.

ఆరంభములో శ్రీ శ్యామానందుడు బృందావనము నందలి ఒక గౌడీయ మఠమునకు చెందిన సుప్రసిద్ధ భక్తుడు. ఆయన గురువు శ్రీ హృదయనాథజీ మహరాజ్. శ్యామానందులు శ్రీ రాధాగోవింద దర్శనార్థియై హృదయనాథ్‌జీని ఆశ్రయించెను. గురువు ఏ మంత్రమును ఉపదేశింపలేదు. ఎట్టి జప విధా నమును తెలుపలేదు. కేవలమొక కుంజనుచూపి, నిత్యము ఆ కుంజ సేవ చేయుమని ఆదేశించెను. శ్రీ శ్యామానందులు గుర్వాజ్ఞనే మహామంత్రముగ స్వీకరించి, రాధాగోవిందుల సేవాభాగ్యమబ్బినంత భక్తితో కుంజసేవ చేయసాగెను.

క్రమముగా శ్రీ శ్యామానందుని భక్తి పరాకాష్ఠనందెను. చేతనాచేతన సృష్టి యందంతటను ఆయనకు రాధాగోవిందుల ఉనికి అనుభవగమ్యమగుచుండెను. గాలికదలికలు రాధారాణి పైటకొంగు రెపరెపలవలె, పక్షులకిలాకిలారవములు కిశోరి మధురవాక్కులవలె, స్తబ్ధ ప్రకృతి అమ్మనిద్రాముద్రిత సౌందర్యము వలె శ్యామానందుని హృదయమున దర్శనమిచ్చుచుండెను. ఇట్లు ఆయన సాకార నిరాకారోపాసన చేయుచు తన్మయస్థితిలో జీవించుచుండెను. అనితరసాధ్యమైన ఆ భక్తికి, సేవకు రాధారాణి వశమైనది. అమ్మ "భక్తానుగ్రహకాతర" కదా ! శ్యామానందుని అనుగ్రహింపదలచినది.

ఒకనాడు ఎప్పటివలె శ్యామానందుడు బ్రహ్మాముహూర్త సమయమున లేచి కుంజను శుభ్రపరుపసాగెను. దివ్యజనని సంకల్పానుసారము ఆనాడు కుంజలో ఆతనికి సువర్ణనూపురమొకటి

కన్పించెను. దానిని తాకినంతనే ఆయన దేహమంతయు పులకించి, ఆనంద బాష్పములు కారసాగెను. స్పర్శమాత్రముననే తన్మయత్వము కలిగించిన ఆనూపురము సామాన్యమైనది కాదనియు, సాక్షాత్తు రాధారాణి కాలిఅందియ ఐయుండవలెననియు గ్రహించిన శ్యామానందులు దానిని తనవస్త్రమున ముడివేసి బొడ్డు నందు దోపి భద్రపరచెను.

ఈలోగా, రాసలీలానంతరము సేదతీరుచున్న రాధారాణి పాదముల జూచిన లలితాసఖి "దేవీ! నీకాలినూపురము కన్పింపదేమి" అని ప్రశ్నించెను. అందుకు అమ్మ 'సఖీ! మనము శ్యామానందుని ఆశ్రమము మీదుగా వచ్చితిమి కద ! అక్కడ పడిపోయి ఉండును. నీవు స్వయముగా వెళ్ళి తీసికొనిరమ్ము" అని మధురముగా పలికినది. అమ్మ ఆజ్ఞానుసారము లలితాదేవి ఒకసామాన్య వ్రజవనిత వేషమును ధరించి శ్యామానందుని ఆశ్రమమునకు వచ్చినది. "శ్యామానందా ! నిన్నటిదినమున నాకోడలు యమునకు నీ ఆశ్రమ మార్గమున వెళ్ళినదట. ఆమె సువర్ణనూపురము ఇక్కడెక్కడో జారిపడిపోయినదట. నీకు దొరికియుండవచ్చును. దానిని ఇమ్ము" అని అడిగిన లలితాదేవిని జూచి శ్యామానందుడు నవ్వెను. "నీ కోడలు అంతగొప్పదా ? ఆ ఆభరణము సామాన్యమైనది అనుకొంటివా ? దాని దర్శనమాత్రమున, స్పర్శమాత్రమున కలిగిన దివ్యానుభూతిని వర్ణింపతరముగాదు" అని శ్యామానందుడు ఖండితముగ పలికెను. అంతట లలితాదేవి నిజరూపముతో శ్యామానందునకు దర్శనమిచ్చినది. శ్యామానందుడామెకు ప్రణమిల్లి 'అమ్మా ! నీదర్శన భాగ్యముచే ధన్యుడనైతిని. కాని ఈ ఆభరణము ఎవరిదో వారిని స్వయముగ చూడనిదే ఈయజాలన'ని వినయముతో పలికెను. లలితాదేవి రాధారాణికి శ్యామానందుని ఆశ్రమమున జరిగిన విశేషములను తెలిపినది.

శ్యామానందుని పట్ల సంప్రీతురాలైన బృందావనేశ్వరి శ్రీ రాధారాణి అతని వద్దకు స్వయముగ వచ్చినది. హరివల్లభ దర్శనముతో

శ్యామానందుడు పరవశుడై ఏడువసాగెను. ఐనను తన జీవితలక్ష్యమైన "యుగళదర్శనము"ను ఆతడు మరువలేదు. ఆతడు శ్రీదేవికి భక్తితో ప్రణమిల్లి 'అమ్మా ధన్యుడను. శ్రీ రాధ శ్రీకృష్ణుని విడచియుండదు కదా! మరి బృందావన చంద్రుడు ఇచట లేడే" అని పలికెను. కరుణాసింధువైన రాధారాణి భక్తవశంవదయై శ్యామసుందరుని తన ప్రక్కనే ప్రత్యక్షము గావించినది. శ్యామసుందరుడు నవ్వుచు "రాధా! నీ భక్తులు గడుసువారు సుమా"అనెను. అందుకు రాధాదేవి "శ్యామ్ ! ఇతడు నీ దర్శనము కూడ కోరుకొనెను. అందువలననే నిన్ను సంకల్పించితిని" అని పలికి ఇక తన నూపురమును తనకిమ్మని శ్యామానందుని అడిగెను.

శ్యామానందుని జన్మనఫలము కాగా శ్రీరాధాగోవిందుల యుగళదర్శనము లభించెను. ఇక అమ్మపాదస్పర్శాభాగ్యమునకై ఆతని అణువణువు తపించుచుండెను. దివ్య దర్శనానుభూతిచే వశము తప్పుచున్న మనశ్శరీరములను ఎట్లో స్వాధీనపరచుకొని శ్యామానందుడు 'అమ్మా ! ఈనూపురము నీదోకాదో నేనేతొడిగి, స్వయముగా తెలిసికొందున'ని ఆర్తితో వేడుకొనెను. అమ్మ మధురమందహాసము చేయుచు బ్రహ్మాది దేవతలకును దుర్లభమైన తన శ్రీచరణమును శ్యామానందుని తొడపైనుంచెను. ఆహా! ఏమి శ్యామానందుని భాగ్యము! శ్యామసుందరుడు పారాణితో అలంకరించిన శ్రీ రాధ మృదులపాదపద్మము ఆతని ఒడియందున్నది. శ్యామానందుడు ప్రేమాశ్రువులు కార్చుచు, ఒకనొక దివ్యపారవశ్యస్థితిలో అమ్మ పాదమునకు నూపురము నలంకరించుటకై ముందుకు వంగెను. అంతే ! వెంటనే ఆతడు భావసమాధియందు మునిగిపోయెను. తెలివి వచ్చుసరికి ఎవరును లేరు.

ఆ తన్మయు స్థితిలోనే శ్యామానందుడు తనగురువగు హృదయనాథుని వద్దకు పరుగున వెళ్ళెను. గురువు ఆతనిని చూచుచునే 'శ్యామానందా ! నీవు ఏదైన క్రొత్త సంప్రదాయమును స్వీకరించితివా ? లేనిచో

నీముఖమున ఆ ఎఱ్ఱని నిలువుబొట్టు ఎట్లు వచ్చినది ?' అని ప్రశ్నించెను. అప్పుడు శ్యామనందుడు జరిగిన వృత్తాంతమంతయు సద్గురువునకు విన్నవించి, తాను రాధారాణి పాదపద్మములపై భావావేశస్థితిలో పడియుండినపుడు ఆతల్లి పారాణిరేఖ అంటుకొని యుండవచ్చునని సమాధానమిచ్చెను. గురువు "ఓహో ! మరియొక అబద్ధమా ! నీవు అంతటి మహనీయుడవా ! ఎందరో మహత్ములు అమ్మ దర్శనభాగ్యము లభింపక దుఃఖితులై యుండగా, ఆ తల్లి దర్శనము నీకు లభించినదా" అని ఎగతాళి చేసెను. అపుడు శ్యామానందుడు 'గురుదేవా ! మీకు నాపై సర్వాధికారములు కలవు. ఈ బొట్టును చెరిపివేయు అధికారము కూడ మీకు ఉన్నది. ఇచ్ఛవచ్చినచో అట్లు చేయుడు' అని వినయముతో పలికెను. గురువు శ్యామానందుని ముఖముపై అమ్మవేసిన ముద్రను చెరిపివేయుటకు ప్రయత్నించునంతలో అత్యంత సుందరమైన, మృదుల మనోహరమైన చిన్నారి హస్తమొకటి అడ్డుగ నిలచెను. ఆ దివ్య దర్శనమైన వెంటనే గురువు ఏడ్చుచు 'అమ్మా ! రాధే! రాధే! నీవేనా అమ్మా ?" అనుచుపడిపోయెను. ఉత్తరక్షణమున శ్యామానందుడు ఆనందపారవశ్యమున ఉన్మత్తుడై బృందావన వీధులలో శ్యామా! శ్యామా ! అనుచు పరుగిడసాగెను. వ్రజవాసులనేకులు ఆయన వెంట పరుగులు తీసిరి. అటుపై శ్యామానందుడు శ్రీ రాధాగోవిందులకు అత్యంత ప్రీతిపాత్రమైన 'శ్యామ్‌కుండ్'లోనికి దూకెను. వారి శరీరమునకై ఆ కుండములో వెదుకగా కన్పించలేదు. శ్రీ రాధాగోవిందులు శ్యామానందుని సశరీరముగా తమ నిత్యలీలలోనికి స్వీకరించిరి.

శ్యామానందుని రసమయ గాధానంతరము శ్యామానంద సంప్రదాయము బృందావనము నందు ప్రసిద్ధిగాంచినది. బృందావనములో అతని పేర 'రాధాశ్యామసుందర్' అను ఆలయము నిర్మింపబడినది. శ్యామానందజీ ఒక మంజరీగా మారి రాధాజీ సేవ చేయుచుండెను.

**"జనతపాదంలకన్నను, తీర్థ ప్రసాదములకన్నను, బృందావరిక్రమణముకన్నను అమ్మ సేవయే రసికభక్తుల ముఖ్య లక్షణము"** అని శ్యామానందుల జీవితము ద్వారా రాధాదేవి సందేశము ఇచ్చినది.

## గులాబ్ బాబా

"జీవుడు పుట్టినది సంసార సుఖములకొరకు కాదు, భగవత్సేవకు మాత్రమే"- ఇది గులాబ్‌బాబా జీవితము ద్వారా రాధాదేవి ఇచ్చిన జగత్సందేశము.

అమ్మ ప్రతిష్ఠ కొరకై, అమ్మ యొక్క నామవ్యాప్తి కొరకై, అమ్మ యొక్క దివ్య ఆశయ ప్రచారము కొరకై అమ్మనే ముఖ్యలక్ష్యముగ పెట్టుకొని మనజీవితములనే అమ్మ సేవగా అర్పించవలసియున్నది. ఇదియే తన జీవిత ప్రధాన ఆశయముగా చేసికొనినందున "భక్తానుగ్రహకాతర" అను స్తుతి అమ్మ జీవితమునుండి పుట్టినది. మనము కూడ మన జీవితములో అమ్మ సేవనే ముఖ్యముగా భావించుకొని జీవింపవలసియున్నది. ఏ జీవుని మనము సేవింపగలమా అని ఆత్రుతగా ఎదురుచూచుచుండవలెను. ఇప్పుడు వ్రాయుచున్న గులాబ్‌బాబా అను భక్తుని జీవితాశయము ఏమనగా 'ఏ దినమున నేను అమ్మ సేవ చేయజాలనో ఆ దినమున నాకు అన్నాహారములు ఉండకూడదు. ఆ దినమున ఆహారము తీసికొనుటకు నాకు అధికారము లేదు". ఈ జీవితాశయమే గులాబ్‌బాబా యొక్క జీవిత రహస్యము.

ఈ వ్యాసకర్తయగు రాధికా ప్రసాద్ గారి జీవితము కూడ ఇట్టి సేవామార్గములోనే నడచుచున్నది. వారు దినమునకు కనీసము 60, 70మందికి రకరకముల సేవలను సమర్పించుచుందురు. కొందరు బహుకాలము నుండి రుగ్మతలతో బాధపడుచు వారి వద్దకు వచ్చుచుందురు.

అమ్మ కృపచే రాధికా ప్రసాదులు వారిని స్వస్థులను చేసిపంపుచుందురు. మరికొందరు తమ బిడ్డ కనిపించుట లేదన్న దుఃఖముతో వారిని సమీపింపగా మహరాజ్ గారు ఆ బిడ్డ యొక్క యోగక్షేమములను గూర్చి చెప్పి వారిని తృప్తి పరచి పంపుచుందురు. ఇంక కొందరు తాము ఎంత ప్రయత్నించినను ఉద్యోగము దొరకుట లేదని బాధపడుచు మార్గమును ఉపదేశింపుడని ప్రార్థింప వారికి తపశ్శక్తి అవసరమని చెప్పి రాధాదేవిని ధ్యానింపవలసిన విధానము తెలియజెప్పి పంపుదురు. మరికొందరు దూరప్రాంతములలో నుండి తమ తీవ్ర అనారోగ్యమును గూర్చి చెప్పికొనగా వారికి ఫోన్ ద్వారా మంత్రము వేసి నయము చేయుచుందురు. ఈవిధముగా రోజుకు కనీసము 50, 60మంది ఆర్తులు రాధికా ప్రసాద్‌లను చుట్టుముట్టి తమ కష్టములను చెప్పికొని ఆయన ద్వారా శాంతిని పొందుచుందురు.

ఇట్టి సేవా సూత్రమును అనుసరించి జీవించు భక్తుడు బృందావనములో జన్మించెను. ఆయన పవిత్ర నామమే "గులాబ్ బాబా".

గులాబ్‌బాబా భార్య చనిపోయినది. 8-9 సంవత్సరముల వయస్సు గల ఒక బాలికను అతడు బిడ్డగా పెంచుకొనుచుండెను. గులాబ్‌బాబా గొప్ప సితార్ సంగీత విద్వాంసుడు. అంతేకాదు, ఆయన నాట్యకళాకోవిదుడు కూడ. అతడు తన విద్యలను (సంగీతము, నృత్యము) ఉచితముగానే నేర్పుచుండెడి వాడు. ఆయన తనకుమార్తెయగు రాధతో కలసి కొద్దిమంది వ్రజవాసుల ఇంటికిపోయి అచట రాధానామము చేయుచు నిలుచుండెడివాడు. కొంతసేపటికి ఇంటిలోని వారు కొన్ని రొట్టెలను, మిఠాయిలను తెచ్చి గులాబ్‌బాబా జోలీలో వేసెడివారు. అతడు ఒక్కరోజు కూడా తన భక్తిని విడచి భిక్షుకునిగా లేడు. "మానవుడు ఈ లోకమునకు వచ్చినది భిక్షాటన చేసియైనను పొట్టపోషించుకొనుటకు కాదు. ఆతని ఆశయము శరీరపుష్టికాదు. ఆత్మపుష్టి. లోకమాత అనగా ఆత్మలకు మాత. రసస్వరూపిణియగు రాసేశ్వరి అయిన రాధాదేవి యొక్క నిత్యసేవయే

మనధర్మము. ఏ దినమున నీవు అమ్మసేవను చేయవో ఆ దినము నీవు భోజనము చేయుటకు అర్హుడవు కాదు. కనుక అమ్మసేవ చేయనిదినమున ఉపవాసముండటయే నీ ధర్మము. సేవయనగా నీకు గల శక్తులను అమ్మ ప్రీతికొరకు సమర్పించుట. నీవు గాయకుడవైనచో ఆ గానశక్తిని అమ్మ సుఖము కొరకై వినియోగించుము. ఆ శక్తిని ఎవరికిని విక్రయము చేయకుము. నీకు ఉన్న శక్తులన్నింటికి కారణము రాధాదేవియే. నీ శక్తులను అమ్మసేవకై, అమ్మ ప్రీతికై వినియోగించుచు జీవించుటయే నీధర్మము. భగవత్సేవ చేయనిరోజున జీవునకు జీవించు హక్కులేదు" అని గులాబ్‌బాబా చెప్పుచుండెడివాడు. ఆ తత్వానుసారమే తన బిడ్డయగు రాధను కూడా గులాబ్‌బాబా నడుపుకొనుచుండెడి వాడు. ఆ బిడ్డకు కూడ గానమును, నృత్యమును చక్కగా నేర్పించినాడు. బిడ్డయు, తానును రొట్టెలను తిని అమ్మకు అభిషేకము చేసిన తీర్థమును మాత్రమే త్రాగి జీవించుచుండెడివారు. రాధే రాధే రాధే యనుచు బర్సానాలోని అమ్మ పర్వతమునెక్కి అచ్చటనున్న రాధాదేవి గర్భాలయమున కెదురుగా నిలువబడి తన సితార్ వాద్యముతో సుందరమైన పాటను గులాబ్‌బాబా పాడుచుండ, అతని కుమార్తెయగు రాధ రాధాదేవి సంతోషించుచున్నదను భావముతో ఇతర చింతనలన్నియు మానుకొని సుందరముగ నృత్యము చేసెడిది. ఇదియే గులాబ్‌బాబా యొక్క నిత్యసేవావిధానము. ఇదియే వాని జీవితము. ఇదియే వాని తపస్సు. కొంతకాలమునకు ఆలయ ధర్మకర్తలు గులాబ్‌బాబాను చూచి "బాబా! మీ కుమార్తె రాధ పెద్దపిల్ల అయినది. ఇంత వయస్సులో నృత్యము చేయుట బాగుగనుండదు. ఆమెకు తగిన సంబంధము చూచి వివాహము చేయుము. వివాహమునకగు ఖర్చునంతయు మేము భరించెదమ"ని పలికిరి. అట్లే ఆ బాలికకు వివాహము చేసి అత్తవారింటికి పంపిరి. ఆ దినము నుండియు గులాబ్‌బాబా ఒంటరివాడైపోయెను. 'నా కుమార్తె అత్తవారింటికి వెళ్ళిపోయినది. నా పాటలకు అనుగుణముగ నృత్యము చేయువారు లేరు.

దీని వలన రాధాజీకి చేయు నృత్య గానముల నిత్యసేవ ఆగిపోయినది. ఇకనేను భోజనము చేయజాలను. జీవింపజాలను' అని గులాబ్ బాబా తలచెను. గులాబ్‌బాబా రాధాజీ ఆలయమెట్టుపై శిరస్సును మోపి ఏడ్చుచు భోజనము మాని మూడు దినములపాటు పడియుండెను. అతడు రాధాదేవితో ఇట్లు తన కష్టమును విన్నవించుకొనెను. "అమ్మా! నీ సేవయే నా జీవితము. ఏ దినమున నీసేవ నాకు లేదో ఆ దినము నాకు జీవించు హక్కు లేదు. గత మూడు దినముల నుండి నీకు సేవ చేయలేదు, నాకు ఆహారములేదు'' అని చెప్పుకొనెను. అది మండు వేసవికాలము. గులాబ్‌బాబా వయోవృద్ధుడు. ఆతనికి మూడు దినములనుండి ఆహారము లేనందున బాగుగా శుష్కించిపోయెను. ఇక అతడు విశేషకాలము జీవించడనుట సత్యము. రాధాజీ సర్వవ్యాపక మూర్తియే కాక పరమదయామయి కూడ. "పాపము నా భక్తుడగు గులాబ్ బాబా నా సేవ చేయలేని కారణమున భోజనము మానుకొనినాడు. ఆతడు వయోవృద్ధుడు. ఇది వేసవి కాలము. ఇంకనేను తటస్థముగ నున్నచో ఆతడు మరణించును. ప్రాణము పోవు స్థితిలో జీవుని యొక్క మనోస్థితిని బట్టియే మరుజన్మ నిర్ణయమగును. ఇది నా నియమము. ఇట్టి స్థితిలో నున్న బాబా కొన్ని శరీర రుగ్మతలకు లొంగిపోవును. పిమ్మట వానిచే చనిపోవును. అట్టి స్థితిలో చనిపోయినచో దుఃఖముతో కూడిన జన్మయే వానికి కలుగును. నా సేవకులు ఆనందముగా ప్రాణములు విడచి శాశ్వతమైన ఆనందస్థితికి పోవలయును. ఇది నా నిర్ణయము. నా మతము. బాబా ఇప్పుడు దుఃఖస్థితిలోనున్నాడు. ఇతనిని ఇప్పుడు భక్తి పారవశ్యముతో కూడిన స్థితికి నేను మార్చవలయును. అట్లు మార్చి, నా ప్రేమ భక్తుడయిన కారణమున వాని చేయి పట్టుకుని నా ధామమునకు ఇప్పుడే తీసికొని పోవలసియున్నది. ఇప్పుడు నాకు ఒక్కటే మార్గము. అత్తవారింటికి పోయిన ఆతని కుమార్తె వేషమును నేనే ధరించి ఆతనికి గోచరించి, ఆ బాలికవలె నృత్యము చేయక

తప్పదు. ఏమైనను గులాబ్‌బాబాకు జీవితమునందు ఇదియే ఆఖరి దినము" అని అమ్మ యోచించుకొని తన దివ్యసంకల్పముచే తానే ఆ బాలిక రూపమును ధరించి గర్భగుడిలో నుండి బయటకు వచ్చినది. 'ఆహా ! జననీ ! నీ భక్తుల ఎడల నీకు గల అనురాగమునకు పరిమితి లేదమ్మా ! ఈ అనురాగము వలననే కదా మూడు సంవత్సరముల బాలికగా నిరుపమానమైన అవతారమును ధరించి వచ్చితివి !'

గులాబ్ బాబా కుమార్తె రూపమున ఆలయమునందలి విగ్రహమునుండి బయటకు వచ్చిన రాధాజీ ఆలయ మెట్లపై తలపెట్టి పడుకొనిన గులాబ్‌బాబా వద్దకు వచ్చి 'పితాజీ ! నేను వచ్చితిని. నృత్యము చేసెదను లెమ్ము. ఏల దుఃఖపడెదవు?' అని మధురముగా పలికినది. కుమార్తె అత్తవారింటికి వెళ్ళినదను విషయము బాబా పూర్తిగా మరచిపోవునట్లు తన యోగశక్తితో చేసినది. బాబా ఈమె తన కుమార్తెయేయను భావముతో లేచి కూర్చుండి "తల్లీ ! వచ్చితివా ! ఇప్పుడు నన్ను ఏపాట వాయించమనెదవో చెప్పుము" అని కోరగా ఆ బాలిక, అనగా రాధాజీ "మైనే రట్‌నా లగాయే రాధానామ్‌కీ" అనుపాట నాకెంతయో ఇష్టము. అదియే వాయింపుము" అని పలికెను. గులాబ్ బాబా సితార్ మ్రోగసాగినది. బాలిక నృత్యము చేయుచున్నది. బాబా సితార్‌ను వాయించుచు అదేపాటను పాడుట మొదలుపెట్టెను. ఆ పాట అర్థమేమనగా 'సదా రాధానామమునేస్మరించుచుండుము. నా వాక్కులో రాధ, నా నేత్రములలో రాధ, నా రోమరోమమునందును రాధయే'.ఆ పాటను పాడుమని బాబాతో చెప్పుటలో రాధాజీ యొక్క నిజమైన ఉద్దేశ్యమేమనగా 'ఆపాట యొక్క భావముతో మనస్సులు నింపుకొనుడ'ను జగత్సందేశము. ఆ పాట యొక్క భావముతో మనస్సులు నింపుకొనుటయే పరమావధి వద్దకు మనలను సులభముగా తీసికొని వెళ్ళగలుగుసాధనావిధానము. ఆ బాలిక చెప్పినట్లే ఆ పాట పాడుచు ఆహా ! ఎంత మధురమయిన పాట ? అనుకొనుచు

గులాబ్‌బాబా కన్నీరు కార్చుచుండెను. బాలిక నృత్యమును చూచుచు గులాబ్ బాబా ఇట్లు తలంపసాగెను. 'ఆహా! ఇదెక్కడి నృత్యము! ఇది వరకు ఎన్నడును ఇట్టి నృత్యమును నేను చూడలేదే'. ఆతడిట్లు భావించుచుండగా ఆ బాలిక నేలపై నృత్యము చేయుట మానివేసి సుమారు గజము ఎత్తున ఆకాశమునందు దేవతలు కూడ కనివిని ఎరుగని విధమున అత్యంత మనోహరముగ నృత్యము చేయసాగెను.

బాలకృష్ణుడే అనేక పర్యాయములు రాధవద్ద నృత్యమును నేర్చుకొనుచుండునని వ్రజపురాణములయందున్నది. అమ్మ నృత్యము చేయుట ఆరంభించినది మొదలు హ్లాదినీశక్తి మహిమ వలన బాబా లోకమును మరచెను. ఇంతలో హఠాత్తుగా బాబాకు తన కుమార్తెకు వివాహమై అత్తవారింటికి వెళ్ళినదను విషయము జ్ఞప్తికి వచ్చి ఈ నృత్యము చేయుచున్నది రాధాజీయే అని స్ఫురించినది. 'ఆహా ! ఎవరు ? ఆకాశములో నృత్యము చేయుచున్నది ఎవరు ? నా తల్లి గుడినుండి బయటకు వచ్చినదా ? నాకొరకై వచ్చినదా ? నేను మూడు దినముల నుండి భుజించుట లేదను జాలితో వచ్చినదా ? ఆహా ! ఏమమ్మా నీ అనుగ్రహము ! నీ హృదయము ఎంత సుకుమారమమ్మా !' అనుచు గులాబ్‌బాబా అమ్మ పాదములపై తల వాల్చెను. అంతే ఇక గులాబ్‌బాబా లేడు. అమ్మ ఆతనిని తన లోకమునకు తీసికొని వెళ్ళిపోయినది.

అమ్మ తన భక్తుల యందు మహత్తరమయిన అభిమానముతో, కరుణతో రసికభావముతో ముద్దులొలుకు విధమున తానే భక్తులను మేల్కొలిపి రసపుష్టిని ప్రసాదించి క్షణములో నికుంజకు తీసికొని వెళ్ళుచున్నదే! ఎంతటి భక్తానుగ్రహ కాతరత్వము!

# మహారాజా కులచంద్రుడు

బృందావన సమీపమునందు కులచంద్రుడను మహారాజు మణిపుర రాజ్యమును స్థాపించి నిత్యము రాధాజీ సేవలను చేయుచుండెను. "అమ్మ నావద్దనే ఉన్నది. ఏపని చేయుచుండినను అమ్మ నన్ను చూచుచునే యున్నది. మహత్తరమైన మానవ సేవయే అనన్యనిష్ఠయగు అమ్మసేవ" అని ఆయన భావించుకొను చుండెడివారు.

అమ్మ సేవ రెండు విధములుగ ఉండును.

1) ప్రత్యక్ష సేవ 2) పరోక్ష సేవ.

అమ్మ మన ఎదుట లేదు. ఎక్కడ ఉన్నదో మనకు తెలియదు. కాని 'అమ్మ సమక్షములోనే నేనుంటిని. నా కర్తవ్యమును నేను నెరవేర్చుచుంటినా లేదా అని అనుక్షణము అమ్మ గమనించుచునే ఉన్నది. నా కర్తవ్యము ఒక్కటే ! అమ్మ ప్రీతి కొరకై జీవించుటయే నా జీవిత లక్ష్యము. ఈ కార్యము అమ్మకు ప్రీతియగునా కాదా! ఇట్లు నేను మాట్లాడుట అమ్మకు ప్రీతియేనా ? ఈ ఆలోచన అమ్మకు ఇష్టమేనా' అనుచు మనోవాక్కాయ కర్మలతో అమ్మను ముడిపెట్టవలెను. అప్పుడే మన జీవితము నిజమైన శరణాగతి భావవముతో నడచును. మనము అమ్మకు చేయు సేవలన్నింటిలోను శరణాగతి సేవయే సర్వోత్కృష్టమైనది. అంతకుమించిన మధురాతి మధురమైన సేవ అమ్మ మననుండి కోరుట లేదు.

ఈ విధముగ రాజా కులచంద్రుని మనోవాక్కాయ కర్మలు నడచినవి. కనుకనే ఆతని జీవితము ప్రపంచమునకే గొప్ప ఆదర్శము. అన్ని మతముల వారికిని ఆయన జీవితమే గొప్ప ఆదర్శము. ఇంగ్లీషులో దీనినే "Self Surrender" అందురు. శరణాగతికి మించిన భక్తి లేదు. భక్తి అనగా తాళములతో నామము చేయుట కాదు. పూవులతో పూజించుట కాదు. జపమాల తీసికొని జపించుటయు కాదు. శరణాగతితో కూడిన భక్తి అనగానేమో అమ్మ చెప్పినది.

'తత్సుఖేన సుఖిత్వమ్' - అనగా నీ సుఖమే నా సుఖము. ఈ భావముతో జీవింపుము. ఈ భావముతో జీవులను ప్రేమించుము. ఈ భావము వలన నీలో అహంకారము మాయమైపోవును. ఈ భావమే నీకు పరమశాంతిని చేకూర్చును. ఒకప్పుడు త్యాగరాజు ఇట్లు పాడెను. "శాంతము లేక సౌఖ్యము లేదు దారసుతులు ధనధాన్యములున్నను ॥ శాంతములేక॥ దాంతునికైన వేదాంతునికైన ॥ శాంతములేక॥.

ఈ పాటను త్యాగరాజుల వారు పాడుచుండగ అనేకులు కన్నీరు కార్చుచుండెడివారట. ఇదియే "అనుభవ వేదాంతము యొక్క నాంది.'

ఇచట వర్ణింపబోవు లీలలో కులచంద్ర మహారాజు కన్నను మిన్నయగు వేదాంతి ప్రపంచమునందే లేడని చెప్పవచ్చును. ఆతడు మహాత్ములలో మహాత్ముడు. యోగులలో మహాయోగి. రసిక భక్తులలో రసిక మహాత్ముడు. దీనినే 'రాధాభక్తి' అందురు. దీనినే 'రాధాభావము' అందురు. రాధాభావముతో జీవించు వాడు త్రిలోక పూజ్యుడు. ప్రపంచమందంతట నిజముగ ఉన్నది రాధాభావమే ! రాధాభావముతో మహాసర్పమును చూచినచో అది తాను సర్పమునని మరచును. తన గుణమును మరచును. ఈ భావముతో కూడిన భక్తుడు నడచిపోవుచుండగ వృక్షములు కన్నీరు కార్చును. రాధాభావమునకు మించిన శక్తి ఈ జగత్తునందు ఎచ్చటను లేదు. ఒకప్పుడు రాధాదేవి ఒక తార్కిక సంభాషణలో కృష్ణునితో ఇట్లు చెప్పినది. 'నీ శంఖ చక్రముల వలన కాని బాణముల వలన కాని నిజమైన లోకకల్యాణము జరుగదు. రాధాభావమే లోకకల్యాణ మార్గము. ఒక రాజ్యము నందు రాధాభావ ప్రదర్శన వలన వందలాది మంది ప్రజలు ప్రేమాశ్రువులు కార్చుచు రాధాభక్తులుగా మారిపోయిరి. అచటనున్న మహారాజు తనకు విధేయునిగా పనిచేయవలసిన ఒక అధికారిని చూచి 'నాయనా! ప్రతిదినము నేనే నీ కుటీరమునకు వచ్చి అవసరమైన సంతకములు చేయించుకొందును. నీవు నా వద్దకు రావలసిన పని లేదు.

నీవే నా మహారాజువు. నేనే నీ సేవకుడను" అని పలికెను.

విఠల్‌దాస్‌జీ జీవితంలో జరిగిన ఒక అద్భుత సంఘటన ఇది. ప్రపంచ చరిత్రలోనే ఇది అపూర్వమైనది. ఇట్టి రసమయ లీలలే శ్రీ రాధాభావ వృక్షము నుండి జనించుచున్న మరువ రాని అమృత ఫలములు. ఈ ఫల రసమును లోక జీవులకు పంచుటకే మూడు సంవత్సరముల వయస్సుతో రాధాదేవి భూమిపై దిగినది. ఆమె ప్రతి అడుగును లోకకల్యాణమే ! ప్రతివాక్యమును లోకకల్యాణమే ! ప్రతి చూపును లోకకల్యాణమే !

ఢిల్లీ నుండి బ్రిటిష్ ప్రభుత్వమునకు సంబంధించిన యుద్ధ సేనలు కులచంద్రుని రాజ్యముపై బడుటయు దీనిని కులచంద్ర మహారాజు త్రిప్పి కొట్టుటయు జరుగుచుండెడిది. ఎన్ని సార్లు బ్రిటిష్ వారు దండెత్తినను విశేషమగు ప్రజానష్టముతో వారు ఓడిపోవుచుండెడివారు.

"కులచంద్రుని మనము అస్త్రశస్త్రములతో ఓడింపలేము. అతడు చాల బలాఢ్యుడు. మహాపరాక్రమశాలి. కుయుక్తి వలననే మనము అతనిని ఓడింపవలెను. అతడు రాధాజీ భక్తుడనివింటిమి. రాధాజీకి గోవులనిన ఎంతయో ప్రేమ. కొన్ని వేలగోవులను, దూడలను తెచ్చి ఆ గోవులకు వెనుక వైపు మన సేనలను నడిపించెదము" అని పై అధికారులకు సైనికులు సలహానిచ్చిరి. బ్రిటిష్ సేనలు మరియొకసారి మణిపురరాజ్యమును ముట్టడించినవి. బ్రిటిష్ సేన బారుగ నిలువబడియుండగ ప్రతి యుద్ధభటునకు ముందు ఒక గోవును కట్టివేసినారు. ఎంత పొడుగున యుద్ధ భటులు నిలువబడి యుండిరో అంత పొడుగునను గోవులు కూడ కట్టివేయబడినవి. కులచంద్రుడు యుద్ధ కవచమును ధరించి, యుద్ధభూమికి వచ్చి నిలచెను. ఆ దినమున బ్రిటిష్ వారినందరిని చంపివేయవలెనని తీవ్ర సంకల్పముతో కులచంద్రుడు యుద్ధభూమికి వచ్చియుండెను. కాని ఆతని కన్నుల యెదుట బారులు తీరియున్న గోవులు కన్పించుచున్నవి. ఆ రాజు మనస్సు దయతో కరగిపోయినది.

కులచంద్ర మహారాజు రాధాప్రియుడు. రాధాదేవి యొక్క ఉన్నత శ్రేణికి చెందిన రసికభక్తుడు. రాధాజీ జగత్తునంతటిని ప్రేమించుచుండును. ఆ తల్లికి ఎందును విరోధము లేదు. రాధాదేవి నిఘంటువులో విరోధి అను పదమే లేదు. అట్టి రాధాదేవికి భక్తుడు కులచంద్రుడు. రాధాదేవికి గోజాతియందు అపరిమితమైన ప్రేమ. గోవులను తన ప్రాణము వలె చూచును. రాధాదేవి భావములో గోవు అనగా దాని బాహ్య స్వరూపము కూడ అయి ఉన్నది. ఒకప్పుడు గోరూపమును ధరించి అనేక జీవులను చంపుచున్న ఒక రాక్షసుని శ్రీకృష్ణుడు సంహరించెను. ఈ విషయము రాధాదేవికి తెలిసి శ్రీకృష్ణునితో 'కృష్ణా ! నా ప్రేమ వస్తువును ఏల చంపితివి' అని ప్రశ్నించినది. "రాధా ! నేనెన్నడు గోవును చంపలేదు. నేను చంపినది లోకకంటకుడైన ఒక రాక్షసుని మాత్రమే. అట్టి రాక్షసుని నేను చంపినందుకు నీవేల కంటతడి పెట్టుచున్నావు" అని కృష్ణుడు రాధను అడిగెను. "ఒక ఆలయములో ఉన్న విగ్రహము దేవుని బాహ్య ఆకారమే తప్ప దేవుని ప్రత్యక్ష స్వరూపము కాదు. అయినను ఆ ఆకారమును కూడ జనులు ప్రేమించుట లేదా ? గోవు యొక్క రూపము కూడ నా దృష్టిలో గోవుతో సమానమే. ఈ దృష్టితో చూచినచో నీవు చంపినది నా ప్రేమ వస్తువునే గాని రాక్షసుని కాదు. నీవు ఒక గోహంతకుడవు. నిన్ను తాకుట పాపము. నిన్ను చూచుట పాపము" అని రాధాజీ వేదనతో పలికినది. " అట్లయిన ఈ పాపము నుండి నేను బయట పడుట ఎట్లు ?" అని కృష్ణుడు దీనముగా అడుగగా " ఒక కుండమును తయారుచేయుము. ఆ కుండమును నేనే నీటితో నింపెదను. గోహత్య, బ్రహ్మహత్యాది పాపములు చేసిన హంతకులైనను సరియే ఆ నీటిలో స్నానము చేసినచో వారు తప్పక పునీతులగుదరు" అని రాధాజీ ఆదేశమిచ్చినది. ఆ సందర్భముననే బృందావనము నందు పరమ పావనమగు రాధాకుండము అవతరించినది. నేటికిని ఈ కుండమునందు లక్షలాది ప్రజలు స్నానము చేసి పునీతులగుచున్నారు.

ఏ భావముతో రాధాజీ గోవులను చూచుచుండునో రాధా భక్తుడైన కులచంద్రుడు కూడ గోవులను అదియే దృష్టితో చూచుచుండెను. ఎదురుగ నున్న గోవులను, లేగ దూడలను చూచి రాజు దిగ్భ్రాంతి చెందెను. బ్రిటిష్ వారు పన్నినకుయుక్తికి ఆయనకు తీవ్ర అవేదన కలిగినది. ఆదృశ్యమును చూచిన కులచంద్రుడు "ఇది యుద్ధభూమియేనా? లేక పవిత్రమైన గోశాలయా? అమ్మా! ఇది నీ వ్యూహమే అని తలచుచున్నాను. నేను యుద్ధము చేయవలసినది భటులతోనా? లేక గోవులతోనా? ఈ గోవులన్నియు నీకెంతయో ప్రియాతి ప్రియములు. సాధారణ మానవ దృష్టిలో గోవు అనగా పాలిచ్చు ఒక జంతువు మాత్రమే. కాని అమ్మా! నా దృష్టిలో గోవు అనగా నీకు ప్రియతమమైన ఒక బిడ్డ, ఒక సఖి. రాధాజీ సఖులతోనా నేను యుద్ధము చేయుట ! అమ్మా ! నీ శోధన ఎంత గొప్పది. నేటి నుండి యుద్ధము మానుకొనుమనియా నీ యాజ్ఞ ! నేటి నుండి యుద్ధము మానుకొని అహోరాత్రములు నీ తపస్సును ప్రారంభించుమని చెప్పుచున్నావా తల్లీ ? నీ అజ్ఞానుసారము ఇంక నేను యుద్ధము చేయను" అని పలుకుచు కులచంద్రుడు తన చేతిలోని తుపాకీని నేలపై పడవేసెను. తనను సమీపించిన భటులతో 'నేను యుద్ధము నందు ఓడినను సరియే, యుద్ధఖైదీగా వారి శిబిరములలో బందీనిఐనను సరే, నా రాజ్యమునకు చెందిన ప్రజలు ఎన్ని కష్టములు పడినను సరియే, ఒక్క గోవునైనను చంపకూడదు. మీ తుపాకీలను నేలపై విడచి నిలువబడుడు. నాతల్లి సర్వవ్యాపకురాలు' అని పలుకుచు ఆ మహారాజు 'రాధే ! రాధే' నేనింక యుద్ధవీరుడను కాను. రాధాప్రియుడను. రాధాసేవకుడను' అనుచు తన రెండు చేతులను పైకెత్తెను.

ఆ స్థితిని గమనించుచుండిన మణిపుర రాజ్య స్త్రీలు అనేకులు "ఇంక మనకు ఈ రాజు కనపడడు. అమ్మా ! మా మహారాజును కాపాడుము. నీవే మాకు ఎల్లరకును దిక్కు' అని ప్రార్థించుచు పూల హారములను తెచ్చి మహారాజును అలంకరించిరి. యుద్ధభూమిలో ఎటుచూచినను కన్నీరే !

బ్రిటిష్ సైన్యాధికారి కులచంద్రుని వైఖరిని గమనించి ఇదియేసమయమని గ్రహించి ఆ రాజును సమీపించెను. అదియే క్షణమున ఆ సైన్యాధికారి మనస్సులో అమ్మ ప్రవేశించినది. ఆ అధికారితో పాటు మరి 10, 15 మంది సేనాధిపతులు కూడ వచ్చిరి. బ్రిటిష్ సేనాధిపతి కులచంద్రునితో ఇట్లు పలికెను. "ఓ కులచంద్ర మహారాజా! నీవు మానవ జాతికి చెందినవాడవు కావు. ఎవరో ఒక మహాదేవతవని నమ్ముచుంటిని. ఓ రాజా! ఈ బ్రిటిష్ సేనకు నీవు ప్రియుడవే కాని శత్రువువు కావు. నా ఆసనమునే నీకిచ్చుచున్నాను. రమ్ము' అనుచు అతడు కులచంద్రునితో పాటు తన ఆసనము వద్దకు వచ్చి, కులచంద్రుని దానిపై ఆశీనుని చేసెను. ఆ బ్రిటిష్ అధికారి "మహారాజా! నీ ఇష్టము వచ్చిన చోట రెండు భవనములు కట్టించుచున్నాము. అందు ఒకటి నీ ఇష్ట దేవతకు, రెండవది నీకు, అనుచు కులచంద్రుని సగౌరవముగా రాధాకుండ్‌నకు సాగనంపిరి.

ఆహా ! రాధాదేవి ప్రేమ ఎంత గొప్పది ! బ్రిటిష్ వారు కులచంద్రునిపై ఎంత గొప్ప ఆదరణ చూపుచున్నారు ! వారి సేనాపతి తన ఆసనముపై కులచంద్రుని ఆశీనుడను చేసెనే ! బ్రిటిష్ వారు కులచంద్ర మహారాజుకు రాధాదేవి మందిరమును, మరియొక నివాన గృహమును కట్టించినిర్మించినారు. ఈ గ్రంథకర్త ఆ రెండు భవనములను, అందునివసించుచున్న విద్యార్థులను చూచిరి.

ఈ సంఘటన జరిగి ఎంతయో కాలమైనను కులచంద్రుడు ప్రజల హృదయములలో ఇంకను సజీవునిగనే ఉండెను. ఆ భవనములను దర్శించుటకై వందలాది ప్రజలు వచ్చుచు, ఆ రాజు చిత్రపటమునకు పూలహారములు వేయుచు, ఆయనను గౌరవించుచున్నారు. నేటికిని వందలాది మంది అచట సంకీర్తన చేయుచున్నారు. ఆనాడు కులచంద్ర మహారాజు ప్రదర్శించిన రసిక భక్తి శాఖోపశాఖలై, మధురాతి మధురమై, తేజో వంతమై నేటికిని వర్థిల్లుచున్నది.

**'జై రాధే ! జై రాధే ! జై కులచంద్ర ప్రభు !'**

# అధ్యాయము - 5

## పాఠక మహాశయులకు ఒక అమృత సందేశము

సాధారణముగా మన వేదములు కర్మ సిద్ధాంతమును గూర్చి

"కర్మాణాం భోగతో నశ్యేత్"

అని ప్రవచించినవి. అనగా కర్మలు అనుభవించిననే గాని నశింపజాలవు. పరీక్షిత్తు ఉత్తరా గర్భమునందు ఉండినప్పుడు ఒక దురాత్ముడు అసూయాద్వేషములతో గర్భమునందున్న పిండమును చంపుటకై మారణాస్త్రమగు మంత్రమును ప్రయోగించినాడు. రథమెక్కి ప్రయాణమగుటకు సిద్ధముగానున్న కృష్ణుడు ఆ ఇంటిలోని వారందరి ప్రార్థనలు విని తన ప్రయాణమును నిలుపుకొని, యోగసిద్ధిచే అంగుష్ఠప్రమాణమైన చతుర్భుజ రూపముతో ఆ గర్భమున ప్రవేశించి పిండమును రక్షించెను. గర్భస్థ పిండమునకు తాను చేసికొనిన కర్మ అనుచు ఏమియు లేదు. కనుక కృష్ణుడు ఆ పిండమును రక్షించెను. కాని ఆ శిశువే పెద్దవాడై 'పరీక్షిత్తు' అను పేరును కలిగి చక్రవర్తిగా విఖ్యాతుడైనాడు. అతడు ఒకనాడు అహంకార పూరితుడై చేసిన దుష్కర్మ కారణమున మునికుమారుని శాపమునకు గురి అయ్యెను. తత్ఫలితంగా ఒక మహాసర్పము కాటునకు బలియైనప్పుడు ఆ కృష్ణుడే వానిని రక్షింపలేకపోయినాడు. కనుక ఈ సృష్టియందలి ప్రతి ప్రాణియు కర్మవశమై తన కర్మలను అనుభవించవలెనని శాస్త్రములు ప్రవచించుచున్నవి. కాని రససింధువైన రాధాదేవి ' శ్రీ రాధాసుధానిధి' యందలి 80వశ్లోక రూపమున సర్వులకు ఒక అమృత సందేశమునిచ్చినది. ఈ సందేశము వేదములకును, సర్వశాస్త్ర ప్రవచనములకును అతీతము. ఆ శ్లోకము భావసహితముగా ఇచ్చట ప్రకటించుచుంటిమి.

శ్లో॥ **కైశోరాద్భుత మాధురీభరధురీణాంగచ్ఛవింరాధికామ్**
**ప్రేమోల్లాన భరాధికాం నిరవధిధ్యాయంతి యేతద్ధియః**
**త్యక్తాః కర్మభిరాత్మనైవ భగవద్ధర్మేవ్యహో నిర్మమాః**
**సర్వాశ్చర్య గతింగతా రసమయీ తేభ్యో మహద్భ్యో నమః**

భావముః కిశోరావస్థ యొక్క అద్భుత మాధురీ ప్రవాహము వలన ఎవరి సర్వాంగములు అగ్రగణ్యములైయున్నవో, ప్రేమోల్లాస రసప్రవాహముచే ఎవరు సర్వశ్రేష్ఠులుగా ఉండిరో అట్టి రాధాదేవిని అంతఃకరణములో నిరవధికముగ్యాధ్యానించు వారి కర్మబంధములు తమంతతామే తెగిపోవును. వారికి భగవద్ధర్మమునందును మమత యుండదు. అమ్మా! రసమయీ ! సర్వాశ్చర్యగతితో జీవించు అట్టి మహనీయులకు నమస్కారము.

**"నిరవధి ధ్యాయంతి యేతద్ధియః**
**త్యక్తాః కర్మభిరాత్మనైవ"**

'నిరవధిక రాధాధ్యానము చేయువారలకు కర్మతనంతట తాను వదలివేయును'. ఈ సత్యము ఈ గ్రంధకర్త జీవితములో ఏవిధముగా ప్రకటితమైనదో ఇక్కడ చెప్పుచున్నాము.

ఈ గ్రంధకర్తయగు శ్రీ రాధికాప్రసాద్ 1953లో మచిలీపట్టణము నందు జిల్లా విద్యాశాఖాధికారిగ ఉద్యోగము నిర్వహించుచుండెడివారు. 1953, ఆగష్టులో ఆయనకు అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారిగా బదిలీ అయినది. ఆ ప్రయాణము గుంటూరు మీదుగా చేయవలసియున్నది. గుంటూరు స్టేషన్‌కు రైలు బండి వచ్చిన వెంటనే ఆయన స్నేహితులు సుమారు పాతిక ముప్ఫయి మంది రసయోగి (రాధికాప్రసాదు)ని దర్శించుటకై పుష్పగుచ్ఛములు ఫలములు తీసికొని వచ్చిరి. ఆ వచ్చిన వారిలో హనుమాయమ్మ అను భక్తురాలు, ఆమె భర్త కోటినారాయణ గారు కూడ వచ్చియుండిరి.

హనుమాయమ్మగారికి ఒకప్పుడు గుండె జబ్బు వచ్చినది. 'ఈజబ్బు

నయముకాదు, ఈమె చనిపోవచ్చున'ని డాక్టర్లు చెప్పిరి. ఆమె త్వరలో మరణింపదనున్నదను దుఃఖముతో కుటుంబ సభ్యులు ఆమెతో ఫొటో కూడ తీయించుకొనిరి. అదే సమయములో గుంటూరులో పి.ఎ.టు డి.ఇ.ఓ.గా పనిచేయుచున్న శ్రీ రాధికా ప్రసాద్ శ్రీ కోటినారాయణగారి వలన ఈ సంగతి తెలిసికొని తన రాధా ధ్యాన శక్తి చేత ఎట్టి ఔషధములును లేకయే ఆమె జబ్బును కొద్ది కాలములో నయము చేసిరి. ఆ రోజునుండియు ఆ దంపతులు రాధికాప్రసాదులను తమ బిడ్డగనే చూచుకొనుచు సంతానములేని లోపమును మరచిపోయిరి.

రాధికాప్రసాదులు తమ బిడ్డ అను మనోస్థితిలో ఉన్న హనుమాయమ్మ గారు ఆరోజు స్టేషనులో ఏడ్చుచు ఈ ప్రయాణమును మానుకొని ఇక్కడే (గుంటూరు స్టేషన్‌లో) దిగిపొమ్మని గట్టిగా కోరిరి. ఆ సంఘటనను గ్రంథకర్త స్వయముగ ఇట్లు చెప్పిరి. " నేను ఎంత చెప్పినను వారు నామాట వినకపోవుటచేత గుంటూరులో దిగి ఆ రాత్రి వారి ఇంట భోజనము చేసి పడుకొంటిని. రాత్రి సుమారు 9 గంటలయినది. నేను హాయిగా నిద్రించుచుంటిని. మరునాటి ఉదయమున నాకు స్వల్పముగా జ్వరము, తలనొప్పి వచ్చినవి. క్రమముగ తొమ్మిది గంటలు అగు సరికి జ్వరము తీవ్రరూపము దాల్చినది. ఆ రోజులలో శ్రీ రాధామహాలక్ష్మి అను దేవత మా ముగ్గురికిని సద్గురువుగా ఉండెడిది. ఆమె మహాశక్తిమయియే కాక, మహాదయామయి. ఏదియో సూక్ష్మలోకమునకు చెందిన ఆ దేవత 'హనుమాయమ్మ అమ్మ' దేహము నందు ఆవహించి '**ఇది సామాన్య రుగ్మత కాదు. డాక్టర్ల మందులవలన ఈ జ్వరము తగ్గదు. ఏ డాక్టరుకు ఈ రోగిని చూపించవద్దు**'అని చెప్పి అంతర్ధానమైపోయినది. అప్పుడు కోటి నారాయణ గారు వీధి తలుపులు మూసివేసిరి. నాకు జ్వరము వచ్చినదని తెలిసికొని గుంటూరు పురమునకు చెందిన 20, 30 మంది నా స్నేహితులు వచ్చిరి. వారు తలుపు తెరువుడని ఎంత కొట్టినను ఈ దంపతులు తలుపు

తెరువలేదు. అప్పుడు కోటినారాయణ గారిపై వారికి కోపము వచ్చినది. 'మీకు నాన్నగారు ఎంత అప్తులో మాకును అంత అప్తులే ! వెంటనే తలుపు తెరువుడు' అని వారు కోపముతో పలికిరి. కోటినారాయణగారు మొండి పట్టుదలతో తలుపు తెరువలేదు. దినమంతయు అట్లే గడచిపోయినది. అంతకుముందే విచ్చేసియుండిన దేవతా ఆదేశానుసారము కోటినారాయణగారు ఏ డాక్టరును పిలువలేదు. మధ్యాహ్నము సుమారు 12, 1 గంటల సమయమున నాకు ఇంకను తీవ్రముగా జ్వరము వచ్చినది. నన్ను పెంచుకొనుచున్న తల్లి హనుమాయమ్మ గారు నా స్థితిని చూచి ఏడ్చినది. ఒక మహాదేవత పలికిన వాక్యమును ఎవ్వరును తిరస్కరించలేకపోయిరి. మధ్యాహ్నము మూడు నాలుగు గంటలకు నా కుటుంబీకులు కూడ వచ్చిరి. కోటినారాయణ గారు నా కుటుంబీకులను చూచి "మీరు దూరము నుండియే ఆయనను చూచి వెడలిపొండు. ఒక మహాదేవత చెప్పినందున ఇట్లు చేయుచున్నానుగాని మీయందు నాకెట్టి విరోధము లేదు" అని పలికిరి. నాకు ఏమందులు వాడలేదు. ఏ వైద్యులు వచ్చి చూడలేదు. నాకంతయును అయోమయముగ ఉండినది. రాత్రి 9 గంటలకు తిరిగి ఆ మహాదేవత వచ్చి ఇట్లు చెప్పినది. "**నాన్నగారి (రాధికాప్రసాదు) ఆయుష్షు ముగియనున్నది. మీకు ఆయనను రక్షించుకొనవలెనని ఉన్నచో మీ ఆయువునే ఆయనకు ఇచ్చివేయుడు. మీ ఆయువును ఆయన ఆయువుతో ముడిగట్టి నేను తప్పక బ్రతికించెదను**" అచటికి వచ్చిన వారలలోఎవ్వరును కూడ తమ ఆయువును నాకిచ్చుటకు అంగీకరించలేదు. అందరును నిశ్శబ్దముగ వెడలిపోయిరి. ఆ నిమిషములో నాకెంతమాత్రము స్మారకము లేదు. అప్పుడు కోటినారాయణగారు కంటతడిపెట్టి, "అంతయు అమోమయముగ ఉన్నది. నాకేమియు తెలియకున్నది. ఒకవైపు ప్రమాదస్థితిలో ఉన్న నాబిడ్డ వంటివాడు. మరొకవైపు చూడవచ్చిన వారు 'గొప్ప డాక్టర్లను పిలిపించి

చూపరా ఏమి ? అను మాటలు ! ఏమి చేయుదును ? ఇంతకుముందు దిగివచ్చి పనిచేయుచుండిన దేవత ఎవరో అసామాన్యమైన మహాదేవత అయి ఉండవలెను". నా చెంత కోటినారాయణగారు, వారి ముఖ్య స్నేహితులు మాత్రమే కూర్చుండినారు. ఎవ్వరును తమ ఆయువును ఈయకపోవుట చేత నా జీవితము ఏమగునో అని వారందరూ దుఃఖపడుచుంటిరి. ఏ వైద్యుని చేత నయము కాదన్న మహాదేవత వాక్కు వారికి జ్ఞాపకము వచ్చుచున్నది. ఆ గది తలుపు వద్దనే వారందరూ మాట్లాడకుండ కూరుచుండిరి. ఆ రాత్రి వంట ఏమియు చేయలేదు. అందరూ దిక్కు తోచక బాధపడసాగిరి. ఆ సమయమందే 'వైద్యులు లేక నాన్నగారు పోయినచో నేనును బ్రతకను' అని హనుమాయమ్మ అమ్మ పలికినది. నా స్మారకము పూర్తిగా పోయినది.

ఆ మహాదేవత కొద్దిసేపటి తరువాత మరల వచ్చినది. **"ఈయనకేమియు భయములేదు. త్వరలో లేచి కూర్చుండును. ఇకపై కొద్దికాలము ప్రతి అగస్ట్ నెలలో కర్మశేషము చేత ఆయనకు స్వల్పమగు అనారోగ్యము వచ్చి శీఘ్రముగ తగ్గిపోవుచుండును. నేనెవరినో ఇప్పుడు చెప్పను. తరువాత మీకే తెలియగలదు. మూడు నాలుగు దినములలో ఆయనకు స్వస్థత చేకూరును. అవుడు ఆయనను అనంతపురమునకు పంపివేయుడు**" అని ఆ దేవత పలికినది.

నాన్నగారికి (రాధికాప్రసాద్) ఎట్లుండునో అని కోటినారాయణగారు కనిపెట్టుకొని యుండిరి. సుమారు ఏడు గంటలకు నిద్రనుండి లేచిన వాని వలె నేను లేచితిని. 'నాకు చాలా బాగున్నది. ఈ నిమిషములో నాకు జబ్బుఏమియును లేదు అని చెప్పితిని. ఇది నా రెండవపుట్టుక అని అందరును స్థిరముగ విశ్వసించిరి".

శ్రీ రాధాసుధానిధిలోని '80' శ్లోకము నాకు వర్తించునని నా నమ్మకము. ఈ సంఘటన అంతయు జరిగనది జరిగినట్లు చెప్పినాను.

పరమేశ్వరి సాక్షిగా చెప్పినాను.

ఈ సంఘటన తరువాత శ్రీ హనుమాయమ్మ గారు తన సద్గురువైన 'రాధామహాలక్ష్మి' పేరును తన పేరుగ పెట్టుకొని ఆపేరును గజేట్‌లో ప్రకటించుకొనినారు.

శ్రీ రాధా సుధానిధియను మహాగ్రంధము మానవమాత్రులెవరును వ్రాయలేదని శాస్త్రములు చెప్పుచున్నవి. శ్రీ రాధారాణికి అంతరంగిక సఖియైన శ్రీహితహరివంశ యొక్క ఊయలనుండి రోజుకొకటి చొప్పున 270 శ్లోకములు అదృశ్య వాగ్రూపమున ఉద్భవించినవి. అపౌరుషేయములైన ఈ శ్లోకములు 'శ్రీ రాధాసుధానిధి' అనుపేర గ్రంధస్థమయినవి. ఈ గ్రంధము శ్రీరాధాదేవి యొక్క అపూర్వ అనంత లీలా వర్ణనము. ఈగ్రంథమునకు కొన్ని వందలమంది భక్తులు వ్యాఖ్యానములు వ్రాసిరి. అపౌరుషేయములైన వేదములు మనకు ఎంత ప్రమాణమో అపౌరుషేయమైన రాధాసుధానిధి కూడ అంత ప్రమాణము, పవిత్రము. ఈ గ్రంథము అపౌరుషేయమే కానిచో 80వశ్లోకము వంటి శ్లోకము మానవమాత్రులు వ్రాయగలరా ? అనాదిగా వచ్చుచున్న "కర్మాణాం భోగతో నశ్యేత్" -'కర్మను అనుభవించిననే కాని అది పోదు' అను సిద్ధాంతమునకు అతీతమైన అద్భుత శ్లోకమిది.

"కైశోరాద్భుత................" అను శ్లోకమును పఠించి, విశ్వసించి కొంతకాలము అభ్యాసము చేసి కొన్ని దివ్యానుభవములను పొందిన ఈ గ్రంధకర్తయైన రాధికా ప్రసాద్ మహరాజ్ గారు చదువరులకు సహాయము చేయుట కొరకై, వారిపై రాధాదేవి అనుగ్రహము కలుగుట కొరకై బృందావనమునందలి 'బడేకుంజ్' అను ప్రదేశమునందు 'కిశోరీకుంజ్' అను భవనమును నిర్మించిరి. అందలి మందిరములో రాధాజీ యొక్క సుందర విగ్రహమును ప్రతిష్ఠించిరి. ఈ మందిరములో శ్రీ రాధాజీ లీలలను ప్రదర్శించుటకు ప్రత్యేకమైన ఒక రాసహాలును కూడ నిర్మించుట జరిగినది. కొంత కాలమునకు ఈ కేంద్రము ప్రపంచమునకంతటికిని 'మూలధ్యానకేంద్రము'గా ప్రకాశింపనున్నది. ప్రత్యేకముగా నిర్మింపబడిన ఈ ధ్యానమందిరములో నెలకు ఒక సప్తాహమహోత్సవము చొప్పున

రాధానిరవధిక ధ్యానము శాశ్వతముగ సూర్యచంద్రాదులున్నంత వరకు నిర్వహింపబడును. ఈ శ్రీరాధాధ్యానసప్తాహములు నిర్వహించుటకు ఎన్ని లక్షల రూపాయలు కావలయునో తెలియదు. మా ప్రమాణము ఏమనిన ఎవ్వరిని ఏమియు కోరకుండుట. శ్రీ రాధాదేవి అన్నియును సమకూర్చును. ఈ సప్తాహమహోత్సవ సందర్భమున ధ్యానములో పాల్గొను పదహారుమంది భక్తులకు ఈ ఏడుదినములును భోజన సదుపాయములన్నియు ఉచితముగ జరుగుటకు ఏర్పాట్లు చేయబడినవి. ఇది మనమందరము తరించుటకు సదవకాశము కదా! ఏమనగా కర్మలు తొలగిన పిదప జీవుడు అత్యంత సులభముగా నివృత్తి మార్గములో ప్రయాణము చేయగలడు. అడుగడుగునను సాధకులకు తమతమ కర్మలే అడ్డుతగులుచున్నవి. ఈ ధ్యానసప్తాహ సందర్భముగ వారికి ఆ అడ్డంకులను తొలగించుకొనగల తపోవిధానము నేర్పబడును. అందువలన ఈ మహోన్నత అవకాశమును జారవిడువక భక్తులందరును ఈ ధ్యానసప్తాహమునందు పాల్గొని కర్మక్షయమును పొందెదరుగాక ! ఇచ్చటికి వచ్చుటకు సంసిద్ధముగా నున్నవారు దిగువ విలాసమునకు ముందుగా తెలియపరుపగోరెదము.

**పరమపూజ్య శ్రీరాధికా ప్రసాద్‌జీ మహరాజ్**
**జుగల్‌కిశోర్ సేవా సంస్థాన్**
**బడేకుంజ్**
**గోపేశ్వర్ మహదేవ్ రోడ్**
**బృందావన్**
**మధుర జిల్లా (యు.పి.)**
**పిన్ కోడ్ : 281121**
**ఫోన్ నెం. 0565-2442583.**

# జై శ్రీ రాధే !



శ్రీ రాధామహాలక్ష్మి

# కర్మలను క్షీణింపజేసికొను విధానము

"కర్మాణాం భోగతో నశ్యేత్"

కర్మ అనాది సిద్ధమైనది. జీవుడు దానిని అనుభవించిననే కాని తీరదు. పురాతన శాస్త్రములన్నియు ఈ విషయమునే నొక్కి వక్కాణించుచున్నవి. శ్రీకృష్ణునకు అత్యంత ప్రియుడైన పరీక్షిన్మహారాజు శాపగ్రస్తుడైనపుడు శ్రీకృష్ణుడు ఆయన కర్మను నిర్మూలింపలేక పోయెను. పాపము! కర్మకు వశుడై పరీక్షిత్తు సర్పగండముచే మరణించెను. కర్మ అంత బలీయమైనది, అంత అనివార్యమైనది.

రాధాజీ యొక్క మహత్తర శక్తి విశేషము చేత ఎట్టి పూర్వజన్మ కర్మనైనను మనము క్షీణింపజేసికొను విధానము ఉన్నది. కర్మ బరువైనది. కర్మలను ఆచరించుచుండు జీవుడు ఆ బరువు చేత క్రిందికి లాగబడి అధో లోకములలో పడియుండును. శ్రీరాధా నిరవధిక ధ్యానము చేత జీవునకు కర్మలు క్షీణించి, బరువు తగ్గి తేలికయై పోవును. ఏ జీవుని కర్మ క్షీణించి పోవునో అతడు ఊర్ధ్వగతికి పోవును. శ్రీరాధా ధ్యానమును ఎవరు నిర్విరామముగ చేయుదురో అట్టివారి కర్మ తెలియకుండగనే మాయమై పోవుచుండును. ఆహా! ఇదియేమి అద్భుతమైన మహాశక్తి! ఈ మహాశక్తిని గూర్చియే "శ్రీరాధాసుధానిధి" ఇట్లు చెప్పుచున్నది.

*"కైశోరాద్భుత మాధురీ భరధురీణాంగచ్ఛవిం రాధికామ్*
*ప్రేమోల్లాస భరాధికాం నిరవధి ధ్యాయంతి యేతద్ధియః*
*త్యక్తాః కర్మభిరాత్మనైవ భగవద్ధర్మేప్యహో నిర్మమాః*
*సర్వాశ్చర్య గతిం గతా రసమయీ తేభ్యో మహద్భ్యోనమః ॥ శ్లో॥ 80*

'అద్భుతమైన కిశోర రూపముతో, ప్రేమతో నిండిన శ్రీరాధాదేవిని ఎవరు నిరవధికముగ ధ్యానింతురో వారిని కర్మ తనంత తాను వదలివేయును. ఆ మహాత్ములకు భగవద్ధర్మమునందు కూడ మమత ఉండదు.'

పై మహా వాక్యము ఆకాశవాణి ద్వారా సర్వేశ్వరియైన శ్రీరాధాదేవి మనకు ఇచ్చిన సందేశము, అభయము. ఈ అదృష్టమును భూలోక ప్రజలకు పంచిపెట్టుటకై ఈ గ్రంథకర్త బృందావనములో "కిశోరీకుంజ్" అను ప్రత్యేక ధ్యానమందిరమును నిర్మించిరి. అందు నెలకు ఒకటి చొప్పున శ్రీరాధా నిరవధిక ధ్యాన సప్తాహములు సూర్యచంద్రులు ఉన్నంతకాలము నిర్వహింపబడును. మన కర్మలను క్షీణింపజేసి, ఊర్ధ్వగతికి తీసికొని పోవుటయే రాధాజీ అవతార విశేషము. ఇదియే నిజమైన లోక కల్యాణము.

అందరును ఈ సదవకాశమును వినియోగించుకొని తరింతురుగాక !

జై శ్రీరాధే

VIJAYA SAI, ☎ 0863 - 2242345